ప్రజాశక్తి

Vol. 6, no. 23

(Jun. 6, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 23

(Jun. 6, 1945)

Bejavāḍa, 1945


Record no. 683

Regd. No M. 4486

0-2-0

# ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 6-6-45 సంచిక 23





కామ్రేడ్స్


ప్రజాశక్తి దినపత్రిక వస్తోందనేసరికి ప్రాణం లేచివచ్చింది. ప్రజాశక్తి పత్రిక నిర్మిస్తున్న ప్రజాఉద్యమాలు, ఆంధ్రదేశమంతటా వాటిప్రభావము, ప్రతి ఆంధ్రునికి పరిచయ విషయమే. నేటి నిజమైన ఆంధ్ర ప్రజా జీవితాన్ని ప్రతిబింబించే, తీర్చిదిద్దే ఆంధ్ర దినపత్రిక లేనికొరతను 'ప్రజాశక్తి దినపత్రిక' తీర్చుతుందని హృదయపూర్వకంగా విశ్వశిస్తున్నాను.


నా వ్యక్తిగత జీవితాన్ని సహితం అనేక ఒడుదుడుకుల నుండి కాపాడి, నన్నొక ఉత్తమ ఆశయానికి, ప్రజాసేవకు ప్రోత్సహించిన పార్టీకి, పార్టీపత్రికకు కృతజ్ఞుడ్ని. ప్రజాశక్తి దినపత్రికనిధికి 10 వేల రూపాయలు సంతోష పూర్వకంగా సమర్పించుతున్నాను.

విప్లవాభివందనాలతో

పల్లెకోన, గుంటూరు జిల్లా } సుంకర తిరుమలరావు.

ప్రజాశక్తి నిధికి 10 వేలు విరాళము వాగ్దానం చేస్తూ కామ్రేడ్ సుంకర తిరుమలరావు వ్రాసిన జాబు





పై నుండి వరుస వరుసగా :

గేటు - 'బంకింపగర్' : పైని బింకిం చిత్రం. మధ్య స్తంభంలో గాంధీ జిన్నాలు - ఇటూ అటూ కార్మిక యువకుడూ, రైతు యువతీ. గేటుపైని, మధ్య ఎర్రజండా, అటు ఇటు కాంగ్రెసు లీగు బావుటాలు.

సభాధ్యక్షులు కామ్రేడు సుందరయ్య.


నాయకులున్న రథంతో ఊరేగింపు.

వచ్చిసందాలు.

పదివేలమంది ప్రజల్లో ఒక భాగం.

సుందరయ్య. గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారు మొదలైన నాయకులు - వల టీప్లు.





## కర్నూలుజిల్లా రైతుమహాసభ దృశ్యాలు

# యుగపురుషుడు వీరేశలింగం

## ఆంధ్రజాతి వికాసాభ్యుదయాలకు పంతులుగారి సేవ

"వీరేశలింగం యుగపురుషుడు. మత సంస్కర్త, సంఘోద్ధారకుడు. మహిళాజన బాంధవుడు. ఆంధ్రసాహిత్యాన్ని, వికాసాన్ని అత్యున్నత పథాలకు తీసుకుపోయిన మార్గదర్శి."

– ఇవీ వీరేశలింగ వర్ధంతి సభలలో ఆంధ్రదేశమంతటా పలువురు ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలు.

మే 27 వ తేదీన ఆంధ్రదేశమంతటా అభ్యుదయ రచయితలసంఘం, వివిధ సాహిత్య సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు వీరేశలింగంగారిని సంస్మరించాయి. యువజనులందరూ వీరేశలింగంగారి ఆదర్శ జీవితాన్ని అలవరుచుకోవలసిందని ఉపన్యాసకులు ఉద్బోధించారు.

### బెజవాడ

బెజవాడలో అభ్యుదయరచయితల సంఘ యాజమాన్యాన, హనుమంతరాయ గ్రంథాలయంలో వర్ధంతిసభ జరిగింది. సభకు శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగా రధ్యక్షత వహించారు.

శ్రీ గిడుగు సీతాపతిగా రుపన్యసించుతూ యిలా అన్నారు: "పంతులుగారంటే ఒక చిన్న విజ్ఞాన సర్వస్వం అన్నమాట. ఆయన శైలిలో ఎట్టి ఒడుదుడుకులుండవు. అది ఆయన ప్రత్యేకత. పండితులకూ పామరులకూ తెలిసే సులభశైలి వారిది.

"అంతోఇంతో చదువుకున్న ప్రతి గృహంలోను వీరేశలింగంగారి పుస్తకాలు చదివియుండని వారరుదు. సంఘ సంస్కరణ దృష్టితో, చమత్కారం చొప్పిస్తూ సాహిత్య సృష్టికి పూనుకొన్నారు. పంతులుగారు గోదావరి ఒడ్డున స్త్రీల సంభాషణలను విని, ఆవాడుకభాషనే చమత్కారంగా తన ప్రహసనాలలో ఉపయోగించారు.

"కాలేజీలో ఒక సామాన్యమైన పండితుడేయైనా, ఒంటరిగా నిలబడి లంచగొండితనాన్ని యెదుర్కొని కృతకృత్యుడయ్యాడు. బాల్యవివాహాలు తప్పని ఒప్పించారు. విధవా వివాహాలు న్యాయసమ్మతమని నిరూపించారు.

"పంతులుగారు వార్ధక్యంలోకూడా పట్టుదలతో వ్రాస్తూవుండేవారు. అదిచూచిఆశ్చర్యచకితులుగాని యువకులు లేరు. త్వరలోనే ఆయన జన్మదినశతాబ్ద్యుత్సవాన్ని జరపాలి."

తర్వాత బెజవాడ భారత మహిళా మండలి అధ్యక్షురాలు, కవయిత్రి శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవిగారు, వీరేశలింగంగారు మహిళాలోకానికి చేసినసేవను ఉగ్గడించారు. శ్రీ సి. వి. కృష్ణారావుగారు పంతులుగారి సాహిత్యసేవను ప్రశంసించారు.

అధ్యక్షులు శ్రీ కాటూరు వెంకటేశ్వరరావుగారు మాటాడుతూ, "పంతులుగారు చిరస్మరణీయులు. కడచిన 50 సంవత్సరాల చరిత్రకు సూత్రధారునివంటివారు. ఆంగ్లవ్యామోహంలోనుంచి తప్పించి, ఆంధ్రుల దృష్టిని మాతృభాషవైపుకుమరల్చిన మహానుభావుడు. సాహిత్యక్షేత్రంలో పంతులుగారు త్రొక్కనిత్రోవ లేదని నా అభిప్రాయం. వారి కవుల చరిత్ర చదవడంద్వారా, నాకు సాహిత్యాభిరుచి కల్గింది. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నిలబెట్టడానికి పోరాడిన మహాయోధుడు. అతని మూర్తిని ఆంధ్రులం యెన్నటికీ మరువలేము" అని అన్నారు.

### భీమవరం

భీమవరంలో వర్ధంతిసభ అత్యంత ఉత్సాహంగా జరిగింది. వీరేశలింగంగారి సమకాలికులుసభ నలంకరించడం విశేషం. అభ్యుదయ రచయితల సంఘం, యువజన సంఘం, సభను జయప్రదంగా నిర్వహించారు.

సభకు శ్రీ జోస్యుల అచ్యుతరామయ్యగారు అధ్యక్షత వహించారు. వీరేశలింగంగారి కాలంలో పునర్వివాహాలకు పౌరోహిత్యం వహించిన శ్రీ వేలూరి అనంతరామయ్యగారు ప్రార్థన గావించారు. అనంతరం యువకులు గురజాడవారి, "దేశమును ప్రేమించుమన్నా" అను గేయం పాడారు. అధ్యక్షులు తమ ప్రారంభవచనాలలో, "ఈగేయం విని నాహృదయం ఉప్పొంగిపోతోంది. వీరేశలింగంగారి జీవితమంతా "వట్టిమాటలు కట్టిపెట్టోయ్" అనే మాటల్లోనే ఇమిడివుంది"అని సెలవిచ్చారు.

రాయసం వెంకటరామయ్యగారు (వెంకటశివుడుగారి సోదరులు) తాము వీరేశలింగంగారి అనుయాయులమన్నారు. తమ కాలంలో వీరేశలింగంగారు వీరోచితంగా పోరాడిన అనేక ఘటనలను చిత్రించారు. ఒకసారి తమ పత్రికలో "బొల్లిఎద్దు చేలోపడి తెగమేస్తోంది"అని వీరేశలింగంగారు వ్రాసే సరికి. లంచగొండియైన ఒక తెల్లదొర ఆఊరునుంచి ట్రాన్స్ఫర్ జేసుకొని జండాపీకాడని చెప్పారు.

శ్రీ పెద్దాడ రామచంద్రరావుగారు, యం. వి. కృష్ణారావుగారు, వీరేశలింగంగారి గుణగణాలను ప్రశంసించారు. వీరేశలింగంగారి వితంతుశరణాలయంలోచదువుకొని, అక్కడే పునర్వివాహం గావించుకున్న శ్రీమతి అన్నపూర్ణాదేవిగారు మాటాడుతూ, "వీరేశలింగంగారు పూనుకున్న సంఘసంస్కార కర్తవ్యం ఇంకా పూర్తికాలేదనీ, ఆయనచూపిన ఆదర్శమార్గాలవెంట ఆంధ్రప్రజానీకం నడవాలనీ, ప్రబోధించారు.

జిల్లాయువజన కార్యదర్శి పరకాల పట్టాభిరామారావుగారు మాటాడుతూ, "ఈనాటికి ఇంకా బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం, స్త్రీల అవిద్య, అస్వతంత్రత, ఘోషా మొదలైనవి పోలేదు. వీటిని నిర్మూలించడానికి వీరేశలింగంగారు గావించిన పోరాటాన్ని మనం కొనసాగించాలి." అని అన్నారు.

ఉపన్యాసాల అనంతరం వీరేశలింగంగారిచే రచింపబడిన ప్రహసనాలు ప్రదర్శించబడినాయి. వీరేశలింగారిపై వ్రాసిన గొల్లసుద్దులను విద్యార్థులు, యువకులు ప్రదర్శించారు.

### నెల్లూరు

నెల్లూరులో సంస్కరణ వివాహసంఘం, బ్రహ్మసమాజం, టాగూరు విజ్ఞానమండలి యువజన సంఘాల యాజమాన్యాన వర్ధంతి సభ విజయవంతంగా జరిగింది. శ్రీమతి దరిశి సుభద్రమ్మగా రధ్యక్షత వహించారు. పంతులుగారు చేసిన సేవను అధ్యక్షురాలు ఉగ్గడించిన తర్వాత పెళ్ళకూరు చంద్రశేఖరరెడ్డిగారు (వి. ఆర్. కాలేజి, అర్థికోపన్యాసకులు) మాట్లాడారు. "పంతుగారు స్త్రీలకు గలిగే అన్యాయాలను ఎదిరించారు. స్త్రీల హక్కులకోసం పోరాడారు. ప్రస్తుత న్యాయశాస్త్రం అనేకవిధాల అన్యాయశాస్త్రంగాఉంది. ముఖ్యంగా స్త్రీలవిషయంలో స్త్రీలకు హక్కులు కలగాలంటే మనం రావుకమిటీ బిల్లును బలపరచాలి. స్త్రీలకుకలిగే అన్యాయాలు కొంతవరకు ఈబిల్లు అరికట్టుతుంది.ఇలాంటిహక్కులకోసం పోరాడటం ద్వారానే, వీరేశలింగంగారిని సరిగా సంస్మరించిన వారమౌతాం."

అమంచర్ల గంగాధరంగారు ఆంధ్రవిజ్ఞానానికి, మహిళా లోకానికి సాహిత్యానికి పంతులుగారుచేసిన సేవను ఉగ్గడించారు.వారి ఆశయాలను, ఉద్యమాలను సఫలీకృతం చేయడానికి పూనుకోవాలన్నారు.

వీరేశలింగం చరిత్ర (బుర్రకథ) ను రాజగోపాలరెడ్డిగారి దళం చక్కగా వినిపించారు.

### హైద్రాబాద్

హైద్రాబాద్, శికింద్రాబాద్‌లోని వివిధ ఆంధ్ర సంస్థల యాజమాన్యాన, శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయ భవనంలో వర్ధంతి సభ దిగ్విజయంగా జరిగింది. శ్రీ అడివి బాపిరాజుగా రధ్యక్షత వహించారు.

బాపిరాజుగారు ఇలా ప్రసంగించారు:

సంఘంలో కుళ్ళు బయలుదేరి నప్పుడు దానిని పరిశుభ్రపర్చడానికి వేదకాలంనుండి మహాపురుషులు పుట్టుతూనే వచ్చారు, అట్టివారిలో శ్రీ వీరేశలింగంగారొకరు. వీరు మత సంస్కర్తగా, సాహిత్య సంస్కర్తగా అమూల్యసేవ చేశారు(మిగతా 11 వ పేజీలో)

# కంచు కాగడా

"పృధ్వీసింగు గొప్పవాడే. అయితే ఏనాడు కమ్యూనిస్టు పార్టీలో చేరాడో ఆనాడే దేశభక్తుడైన పృధ్వీసింగు చనిపోయాడు." అని సెలవిచ్చారు లింగరాజు కొవ్విడి.

ఈ మాటలు లింగరాజుగారు తెనాలి నేషనల్ క్లబ్ వార్షికోత్సవంలో మే 8 వ తేదీన ఉపన్యసించుతూ అన్నారు. కాని, అవి వారి తాహతుకు మించినమాటలు. దీపపుబుడ్డి సూర్యుణ్ణి వెక్కిరించినట్లుగా వున్నాయి. దీపపుబుడ్డి తాహతెంత? అదెంత? పొట్ట విచ్చితే వట్టి కంపు తప్ప!

పృధ్వీసింగ్ త్యాగి. తాను ఏ ఆశయాలకై గదర్‌పార్టీలో చేరినప్పటినుండి పనిచేశాడో, అభారత స్వాతంత్ర్య సంపాదనకొరకే నేటికీ కృషిచేస్తున్నాడు. తన చిన్నతమ్ములు కమ్యూనిస్టులు దేశవిముక్తి కొరకు కార్మిక కర్షక ప్రజారాజ్య స్థాపనకు పనిచేయడం చూశాడు. కమ్యూనిస్టుపార్టీలోచేరాడు. అందువల్ల పృధ్వీసింగ్ దేశభక్తి వన్నె పెరిగిందేగాని, తరుగలేదు. అవీరుని ఆక్షేపించినందువల్ల లింగరాజు నోటికంపు మాత్రం బయటపడింది.

★

దేశభక్తి ఒకరి ముల్లెకాదు. అందరూ దేశసేవ చేయవచ్చు. కాని దేశభక్తిచాటున ప్రజాద్రోహం చేయడం తగదు. ముమ్మాటికీ తగదు.

కృష్ణాజిల్లా కాంగ్రెసు అసెంబ్లీవుంది.దానికొక కోశాధికారి (ట్రెజరర్) వున్నాడు. వారి పేరు పిడికిటి రామకోటయ్యగారు. 1930-33 ఉద్యమాలలో జైలుకెళ్ళారు. 1939లో బోసుగారి ఫార్వర్డుబ్లాకులో చేరారు. తరువాత వ్యాపారంలో దిగి సంపాదించుకొంటున్నారు. జైలుకు వెళ్ళకపోయినా, ఈయన 1942 ఆగస్టు ఉద్యమాన్ని అభిమానించారు.

పైసంగతులు వ్యక్తిపరిచయానికి వ్రాశాను. వాటిలో ఎంచవలసిందేమీలేదు. కాని ఈయన తన వర్తక లాభాలకోసం ఒకవైపున ప్రభుత్వోద్యోగులకు విందులు కుడుపుతుంటాడు. మరొకవైపున, పట్టాభిపీకే ఆగస్టు ఉద్యమములో చేరనందుకు ప్రభుత్వంతో కలసిపోయారని కమ్యూనిస్టులను నిందించుతాడు. ఆ నిందలలో తమతో కలసినందుకు యీ పెద్దమనిషికి కాంగ్రెస్ అసెంబ్లీ భయ్యాలు జిల్లా ట్రెజరర్ ఉద్యోగమిచ్చారు.

వాళ్ళకు యీ రామకోటయ్యగారు ప్రభుత్వోద్యోగికి విందుచేశాడని తెలియదా?అబ్బే, అదేమీలేదండీ! అమధ్య రంగాగారు వైస్రాయి కౌన్సిల్ సభ్యుడయిన సర్ జోగీంద్రసింగ్‌కు విందుచేసినట్లు పత్రికలలో పడిందిగా! ఐనా వూరుకోలా! అలాగే రామకోటయ్య విందు చేశాడనీ, రంగప్ప బంగారు (కృష్ణాజిల్లా కలెక్టరు) గారిని బెజవాడ రైల్వే స్టేషనుకు సాగనంపారనీ ఆంధ్రపత్రికలో వార్తకూడ పడింది. అయినా కండ్లుమూసుకు వూరుకున్నారు. ఏమంటే-వారికి కావలసింది ప్రభుత్వంతో నాన్‌కో-ఆపరేషన్‌కాదు. స్వార్థం కోసం ఎన్ని సార్లయినా ఉద్యోగులచుట్టూ తిరగొచ్చు. ప్రజలకోసం, ఏ ఆహారసమస్య విషయంలోనో మాటాడ్డానికిమాత్రం వెళ్ళకూడదు. ఇదీ వారి వితండవాదన.

కమ్యూనిస్టులను నిందించడానికి రామకోటయ్య తమతోవున్నాడుగా! అంతే చాలు కాంగ్రెసు అసెంబ్లీ భయ్యాలకు, పూజించి పెద్దను చేయడానికి!

ఇక అసలు విషయానికివద్దాం. గౌరవప్రదంగా వర్తకం చేసికుంటేనూ, న్యాయమైన లాభాలు తీసికుంటేనూ తప్పులేదు. కాని యీ కాంగ్రెస్ అసెంబ్లీ ట్రెజరర్ అలాంటి వెర్రిబాగులవాడు కాదండోయ్!

బెజవాడలో కంట్రోలురేటుకు సిమెంటు కొంటాడు. బస్తా 1కి రు 3–11–0. పునాదిపాడులో నిలువచేశాడు. దొంగమార్కెటులో బస్తా1కి రు. 6చొప్పున ప్రజలకు అమ్మించుతున్నాడు. ఓరి దేవుడా! ఇందులో దేశభక్తి మచ్చుకైనావుందేమో చెప్పండి! ఇలా దొంగవ్యాపారం చేయడం ప్రజాద్రోహంకాదా?

'స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్.'

అని హితోపదేశం చేస్తున్నాడు. కీర్తిశేషుడైన గురజాడ కవిచంద్రుడు.



★ సంపాదకీయం

# ప్రజాద్రోహులకు కాంగ్రెసు బురఖా

కమ్యూనిస్టులం ఆంధ్రదేశమంతటా ప్రజాసేవ చేస్తున్నాము. రైతులకు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు కంట్రోలు రేట్లకు అందునట్లు కృషిచేస్తున్నాము. కార్మికులకు న్యాయమైన యుద్ధపుభృతి వచ్చునట్లు ప్రయత్నించుతున్నాము. రైతులు అధికంగా ధాన్యం పండించి ప్రజలకు అన్నమిడాలనీ, కార్మికులు ఎక్కువగా వస్తువులను తయారుచేయాలనీ, ప్రోత్సహించుతున్నాము. పట్టణాలలో రేషనింగ్ అమలుజరపడానికి, కంట్రోలు ధరలకు వస్తువులను అమ్మకుండా దొంగవ్యాపారంచేసే ప్రజాద్రోహులను బట్టబయలు చేయడానికి, పనిజేస్తున్నాము.

ఈ ప్రజాసేవవల్ల దొంగవ్యాపారస్తులకు, ప్రజలను పీడించేవారికి, కమ్యూనిస్టులపైన కోపం హెచ్చుతోంది. వారు రౌడీలను, దుండగీడులను మేపి మాపైకి రెచ్చగొడుతున్నారు. ఇందువల్ల కొన్నిచోట్ల దుండగీడులకు - కమ్యూనిస్టులకు మధ్య ఘర్షణలు కూడ జరుగుతున్నాయి.

ఉద్యోగులలో యుద్ధకాలంలో వ్యాపించిన లంచగొండితనాన్ని ఎదుర్కొడానికి కూడ కమ్యూనిస్టులు కృషిచేస్తున్నారు. అందుచే లంచగొండులైన ఉద్యోగులకు కన్నెర్రగా వుంది. ఇలాంటివారు పైనచెప్పిన ఘర్షణలు జరిగినపుడు దుండగీడుల, వారిని బలపరచే దొంగవ్యాపారస్తుల, పక్షం వహించుతున్నారు. దొంగమార్కెటు నరికడుతూ ప్రజాసేవ చేస్తున్న కమ్యూనిస్టులను విచక్షణ లేకుండా అరెస్టుచేస్తున్నారు.

ఈ ఘర్షణలు కమ్యూనిస్టులకు - కాంగ్రెసుకు మధ్య జరుగుతున్నట్లుగా స్వార్థపరులు ప్రచారంచేస్తున్నారు. దినపత్రికలు నిజంతెలిసికోకుండా, అలాంటి అబద్ధాలను ప్రకటించి ప్రజలకు అపచారం చేస్తున్నాయి. ఉదాహరణకు జొన్నపాడు తగాదాచూడండి. "ఆంధ్రప్రభ" కమ్యూనిస్టులకు - కాంగ్రెసువారికి జరిగిన తగాదా అని ప్రకటించింది. కాని వాస్తవమేమిటి? 1930 నుంచి కాంగ్రెసువాది, కమ్యూనిస్టు అయిన రంగారెడ్డిగారి కుమార్తెను ఒకరౌడీ నిందించాడు. గ్రామపెద్దలు వాడికి బుద్ధిచెప్పడానికిసమావేశమయ్యారు. ఇంతలో మునసబు తప్పుడు రిపోర్టు యిచ్చి, పోలీసులను పిలిపించాడు. పోలీసులు విచక్షణ లేకుండా రెండుపక్షాల వారిపైన కేసు పెట్టారు. దీనిని కాంగ్రెసు - కమ్యూనిస్టు తగాదాగా "ఆంధ్రప్రభ" విలేఖరి చిత్రించి, సత్యాన్ని ఖూనీ చేసాడు. ఇంకో విచిత్రం ఏమిటంటే, యీ రౌడీముఠా తాము కాంగ్రెసువారంకామనీ, జస్టిస్‌వారమనీ, కోర్టులో డిఫెన్సు పెట్టుకున్నారు. జస్టిస్‌నాయకుడు అడ్సుమిల్లి హర్నిడు,వాళ్లు తమపార్టీవారని ఉత్తరసాక్ష్యంఇచ్చాడు.

ఇలాంటిదే ఉప్పలూరు ఘర్షణ. కమ్యూనిస్టులు ఒక నూలు దొంగవ్యాపారిని పట్టుకున్నారు. ప్రజలను పీడించే కరణం, యీ దొంగవ్యాపారి కలసి దౌర్జన్యానికి దిగారు. ఘర్షణ జరిగింది. పోలీసులు కమ్యూనిస్టులను అరెస్టుచేసి, దొంగవ్యాపారిని వదలివేశారు. ఇది "ఆంధ్రపత్రిక"లో కమ్యూనిస్టులు రైతులనుకొట్టినట్లుగా వార్త ప్రకటించింది. ఇది సత్యానికి యెంత విరుద్ధమో వేరుగా చెప్పనక్కరలేదు.

బెజవాడలో అనేక దొంగమార్కెటు కేసులు పట్టుకోబడ్డాయి. రైతులకు ఇనుపసామాను వగైరా కంట్రోలు రేట్లకు అందజేయడానికి కృషి జరిగింది. దొంగ వ్యాపారస్తులకు కోపంవచ్చింది. సి. వి. రెడ్డి లాంటివారు రౌడీలను ప్రోత్సహించి, దెబ్బలాటలకు దారితీశారు. ఇలాగే నగరాల కులస్తులకు ఒక దేవాలయం వుంది. దాని జమా ఖర్చులను ధర్మకర్త లెక్కలు చెప్పుటలేదు. నగరాల కులస్తులంతా కమిటీగా యేర్పడి, ధర్మకర్తను ఒత్తిడిచేశారు. దీనిపై నగరా కమిటీవారికీ, ధర్మకర్త ముఠాకు మధ్య ఘర్షణలు జరిగాయి. వీటినికూడ కొందరు స్వార్థపరులు కమ్యూనిస్టులకు - కాంగ్రెసువారికి మధ్య తగవుగా చిత్రించుతున్నారు. "ఆంధ్ర పత్రిక" నగరాలకు - కమ్యూనిస్టులకు దెబ్బలాట అని ప్రకటించింది.

దొంగవ్యాపారం కాంగ్రెసు పద్ధతా? దేవాలయం సొమ్ముకు లెక్కచెప్పకుండా మ్రింగడం కాంగ్రెసు నీతా? అవినీతికరమైన ఉత్తరాలురాయడం కాంగ్రెసు సాంప్రదాయమా? చెప్పండి! ముమ్మాటికీ కాదు.

కమ్యూనిస్టులపై కోపంతో ప్రజాపీడన చేసేవారు, రౌడీలు కొన్నిచోట్ల 'వెంగమ్మ' నాటకాన్ని ఆడిస్తున్నారు. తమకు నాయకుడైన కామ్రేడ్ సుందరయ్యను నిందించే యీ ప్రదర్శనను యే కమ్యూనిస్టు సహించుతాడు? కమ్యూనిస్టులేకాదు, సభ్యత వున్న ప్రతి ఆంధ్రుడు దానిని అసహ్యించుకుంటున్నాడు. కాని దీనివల్ల ఘర్షణలువస్తే, ఆ వార్తలు పత్రికలలో కమ్యూనిస్టు - కాంగ్రెసు తగాదాగా చిత్రించుతున్నారు.

అసభ్య ప్రదర్శనం, బూతులు కాంగ్రెసు సాంప్రదాయం కాదుగదా! కాని అలాంటివి యెందువల్ల జరుగుతున్నాయి?

స్వార్థపరులైన దొంగవ్యాపారస్తులకు, ప్రజలను పీడించే రౌడీలకు, యేదో బురఖా కావాలి! ఆంధ్రలో కమ్యూనిస్టు - కాంగ్రెసు విభేదాలున్నాయిగదా! ఇక ఈ స్వార్థపరులు ప్రజలను మోసపుచ్చడానికి ఘర్షణలను కాంగ్రెసు - కమ్యూనిస్టు తగవుగా చిత్రించుతున్నారు. కాంగ్రెసు బురఖా వేసుకొని, తమ అవినీతికరమైన పనులను కప్పిపెట్టుకోవాలని చూస్తున్నారు.

అంతేగాని యివి కాంగ్రెసు - కమ్యూనిస్టుల మధ్య తగవులు కాదు. ప్రజావిరోధులైన దొంగవ్యాపారులు, రౌడీలకు - ప్రజాసేవకులైన కమ్యూనిస్టులకు మధ్య జరుగుతున్న ఘర్షణలివి. దినపత్రికలలో ప్రచురించబడే అబద్ధపువ్రాతలను ప్రజలు నమ్మవద్దని మనవి. దొంగవ్యాపారంచేసేవారు, ప్రజలను పీడించేవారు, జైలు ముద్రవున్నా కాంగ్రెసువాదులు ఎన్నటికీ కారు. వారు ప్రజావిరోధులు, దుండగీడులు మాత్రమే.

ఈ సందర్భంలో కాంగ్రెసు నాయకుల బాధ్యత కొంతవుంది. ఘర్షణకు కారకులైన దొంగవ్యాపారులతోనూ, రౌడీలతోను తమకెట్టి సంబంధంలేదని ప్రకటించాలి. అసభ్యకరమైన "వెంగమ్మ" నాటక ప్రదర్శనాలను నిరసించాలి. లేనిచో ప్రజావిరోధులకు పరోక్షంగా సాయపడినవారవుతారు. లేనిచో తమ పేరు ప్రతిష్టలకే కళంకం వస్తుంది. ప్రజల ఆక్షేపణకు గురి అవుతారు.

★ మనరాజకీయాలు

# మంత్రివర్గాలు స్వీకరించడం అత్యవసరం

మద్రాసు గోఖేలుహాలులో మే 29 వ తేదీ బహిరంగ సభలో శ్రీ రాజగోపాలాచారిగారు ప్రతిష్టంభన తొలగించాల్సిన అవుసరాన్ని గురించి ఉపన్యసించారు. "ప్రజలు ఎంత కాలం యిలా కష్టాలను సహించుతారు? వారు అసంతృప్తి చెందారు. తమవారు అధికారంలోకి రావాలని కోరుతున్నారు. ప్రస్తుత యిబ్బందులు తొలగించాలని ఆశించుతున్నారు"అని చెప్పారు.

ఇంగ్లండు యెన్నికలను గురించి చర్చించుతూ రాజగోపాలాచారి తాను ఇంగ్లీషువాడైతే చర్చిల్‌కు వ్యతిరేకంగా ఓటుచేస్తానన్నారు. లేబరుపార్టీ విజయానికి కృషిచేస్తానన్నారు. చర్చిల్ గెలిస్తే యూరపులో బ్రిటను, రష్యాల విభేదాలు యెక్కువవుతాయన్నారు. అదైనా భారతదేశానికి మంచిదేగదా! అనే వ్యతిరేకులను హాస్యంచేశారు.

అందరినీ తనలో లీనంచేసికోడం కాంగ్రెసు సూత్రాలలో ముఖ్యమైనదని రాజగోపాలాచారి తెలియజేశారు. నిర్మాణ కార్యక్రమాన్ని అనుసరించుతున్నామని చెప్పుకొంటున్నవారు కమ్యూనిస్టులను తమసంస్థలలో చేరరాదని నిషేధించడాన్ని ఆక్షేపించారు. మంత్రివర్గాలు పుచ్చుకోరాదని ప్రచారం చేయడం నిర్మాణ కార్యక్రమమా? అని ప్రశ్నించారు. వద్దని చెప్పేవారు వరుసగా కురిపించే స్టేట్‌మెంట్లు చూస్తే, వారికే ఉద్యోగ వ్యామోహం హెచ్చుగావుందని స్పష్టమవుతుందన్నారు. స్వాతంత్ర్యంకోసం పాటుపడేవారంతా కాంగ్రెసులో వుండాలన్నారు. కమ్యూనిస్టులను బహిష్కరించాలనే తీర్మానం కాంగ్రెసు మహాసభలో తప్పక ఓడిపోతుందనే విశ్వాసం ప్రకటించారు.

### ఎక్స్‌ప్రెస్

మే 31 వ తేదీ "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" సంపాదకీయం ప్రతిష్టంబన తొలగించాలనీ, మంత్రిపదవులను కాంగ్రెసువారు స్వీకరించాలనీ, కోరింది. ఇపుడుకాంగ్రెసు అసెంబ్లీలు నిర్మాణ కార్యక్రమాన్ని ప్రచారంచేస్తామని చెపుతున్నాయి. ట్రెయినింగుకు ఎంతో శ్రమపడ్డాకకూడ నిర్మాణకార్యక్రమం ప్రజలలో ఏమంత ఉత్సాహమూ కలిగించడంలేదని చెబుతూ యిలా వ్రాసింది:

"చాలామందినూలువడకాలని కబుర్లుచెబుతున్నారు. కాని ఆచరణలో బహుకొద్దిమందే వడుకుతున్నారు. కబుర్లకు - ఆచరణకు యింతతేడా ఎందుకు వస్తూందో ఆత్మపరీక్షచేసికోవలసివుంది. ఇలా సూచించిన వారిని కోపగించడం సరియైన పద్ధతికాదు." తరువాత (మిగతా 10 వ పేజీ)

## కామ్రేడ్ సుందరయ్యపై కేసు

బందరు సబ్‌డివిజనల్ మేజస్ట్రేటుముందు కామ్రేడ్‌సుందరయ్యపై పోలీసువారు ప్రెలిమినరీ చార్జిషీటు దాఖలుచేశారు. సుందరయ్యగారు నిడుమోలులో చేసిన ఉపన్యాసం రాజద్రోహకరంగా ఉందని, అందువల్ల దేశరక్షణ చట్టంక్రింద వారిని శిక్షించాలని కోరినట్లు తెలుస్తూంది. డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్సు 34 (6), 38 (5) క్రింద కేసుపెట్టినట్లు తెలుస్తోంది

సుందరయ్యగారిని జామీనుపై విడుదలచేయమని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుగారికి పిటీషను దాఖలు చేయబడింది. విచారణ 8-6-45 కు వేశారు. ఇంతవ్యవధి అనవసరం, అది జామీనుయొక్క ఉద్దేశ్యాన్ని భంగపరచడం, ఇంకా త్వరలోనే పిటీషనుపై విచారించవలసిందని కోర్టువారిని కోరగా, ఆ కోరిక నిరాకరించబడింది. చార్జిషీటు, వగైరా సర్టిఫైడు కాపీలుకూడా వెంటనే ఇవ్వకుండా జాగుచేస్తున్నారు.

సాధారణంగా విచారణలో ఉన్న ఖైదీలకు ఇవ్వవలసిన సౌకర్యాలుకూడా సుందరయ్యగారికి ఇవ్వడంలేదు. రాజకీయాలకు సంబంధంలేని పుస్తకాలు, మామూలు వార్తాపత్రికలు ఇవ్వనిరాకరించారు.

జామీను పిటీషను వెంటనే విచారించకపోవడం సాధారణ పౌరసత్వపు హక్కులకే విరుద్ధం. ఇటువంటివి మళ్ళీజరగవని ఆశిస్తున్నాం. జామీనుపై వెంటనే విడుదల చేయమని కోరుతున్నాం.

# చల్లపల్లి ఎస్టేటులో జమీందారీ ఏజంట్ల దురంతాలు

దివి తాలూకా రైతుసంఘం లోగడ "జమీందారు దురంతాలు - ఎస్టేటు రైతుల కష్టాలు" అనే కరపత్రం ద్వారా జమీందారుకు "ఎ" రిజిస్టరు భూములపై ఎట్టిహక్కు లేదని ప్రచారం చేసింది. రైతులు తమ హక్కులను గుర్తించి, గ్రామ సాముదాయక బంజరు భూములను సమిష్టిగా ఉపయోగపరచుకొనసాగారు. కాని, శ్రీకాకుళం ప్రాంతంలో దివానుగారు రైతులను మభ్యపెట్టి పోరంబోకలను, పశువులు తిరిగే గుండేటి బంజర్లను అమ్మడం సాగించాడు. ఎక్కువమంది రైతులు పాడలేదు. పాటిన కొద్దిమంది రైతులు తమ పాటలను రద్దుచేసుకున్నారు. దీనితో జమీందారు కథ అడ్డంతిరిగింది.

దివానుగారు తమ ఏజెంట్లను ఉపయోగించుట ద్వారా గ్రామములో చీలికలు తేవాలనే క్రొత్త పన్నాగం తలపెట్టారు.

వెలువోలు గ్రామంలో కోడుపోరంబోకను అమ్ముటకు దివానుగారు ప్రయత్నంచేశారు. ఆ పోరంబోకు మురుగు పోవుటకు, పశువుల మందకు ఉపయోగపడుతున్నది. ఆగ్రామ రైతులు దివానును కలుసుకుని తమ గ్రామమునకు అది చాల అవసరమని చెప్పగా, దివానుగారు దానిని అమ్మనని అప్పట్లో కళ్ళనీళ్ళు తుడిచారు. అసలు తనకు హక్కుంటేగా అమ్ముటకు? తనకు హక్కున్నదని నిరూపించి, రైతులను మోసపుచ్చుటకు గాను తన ఏజెంట్లు కొడాలి కృష్ణారావు, కోనేరు బసవయ్యగార్ల ద్వారా దానిని కొలిపించాడు. కాని ఆ పద్ధతికూడా నిష్ప్రయోజనం అయింది.

గ్రామ ఐక్యతను విచ్ఛిన్నం చేయుటకు గాను, తన ఏజంటైన కోనేరు బసవయ్యను పోరంబోకలో ఉచితంగా యిళ్ళు వేసుకోమన్నాడు. దీని ద్వారా రైతులలో చీలిక తేవాలని ఆశించాడు. ఎవరీ బసవయ్యగారు? 1942 సంక్షోభంలో ఒకవైపు కాంగ్రెసు బురఖాతోపనిచేస్తూ, రెండవవైపు ప్రభుత్వ ఉద్యోగస్థులతో సంబంధం పెట్టుకొని తప్పించుకు తిరిగాడు. గ్రామమునకువచ్చు కూరగాయల కావిళ్ళపై లైసెన్సుఫీజు(?) వసూలు చేసి దిగమింగాడు. కొడాలినుండి భిక్షకు వచ్చిన పేదబ్రాహ్మణుడి అక్షయపాత్రను లాక్కొని యింటిలో పెట్టుకున్నాడు. ఈజమీందారు ఏజెంటు గ్రామ పోరంబోకలను జమీందారు అండతో ఆక్రమించ పూనుకున్నాడు. ఆ పోరంబోకలో పాకవేయుటకు ప్రారంభించగా గ్రామ రైతులు గ్రామమునకు చాల యిబ్బందనీ, దానిలో పాక వేయవద్దనీ, చెప్పారు. అందుకు నిరాకరించుటయేగాక, బండబూతులు తిట్టుతూ, పాకవేయవద్దని చెప్పుటకువచ్చిన శ్రీ కోనేరు వెంకట్రామయ్యగారిని కర్రతోకొట్టాడు. ఆయనపడిపోయాడు. తక్కిన రైతులు బసవయ్యకు బుద్ధిచెప్పారు.

ఇలాంటి అవినీతి పరులను ఉపయోగించి, తమ హక్కులకొరకు నిలబడే రైతులపైకి పంపించడం జమీందారుకు పరిపాటైనది. అవునుమరి! జమీందారు రైతుల హక్కులను కొల్లగొట్టాలంటే యిక మిగిలియున్న ఆయుధం దౌర్జన్యమేగదా!

రైతులు సమిష్టిగా నిలబడి ఇలాంటి దౌర్జన్యాలను ప్రతి గ్రామంలోను ఎదుర్కొన్నపుడే మన హక్కులను కాపాడుకొనగలం. రైతులందరు రైతుసంఘాలలో చేరాలి. ఐక్యతను ప్రదర్శించాలి. జమీందారీ వ్యతిరేక పోరాటంలో కాకలుదీరిన దివి తాలూకా రైతాంగం యిట్టి అక్రమచర్యలను అరికట్టి తమ ఐకమత్యాన్ని కాపాడుకుంటారని ఆశించుతాము.

— దివి తాలూకా రైతుసంఘం.

# అవనిగడ్డ సంఘటనలు

దివిసీమలో అనేకగ్రామములలో కమ్యూనిస్టులు గ్రామసమస్యలు తీసుకుని పనిచేయుటవలన కమ్యూనిస్టుపార్టీ ఒకప్రజాపార్టీగా అభివృద్ధిచెందింది. దీనికిఓర్వలేని స్వార్ధపరులు పార్టీపైతప్పుడుప్రచారమునకుపూనుకున్నారు. కోసూరివారిపాలెంలో గ్రామప్రజలను పీడించే కోసూరు రత్తయ్య కాంగ్రెసుబురఖావేసుకుని, తన గ్రామయువకులను పురికొల్పి వెంగమ్మ నాటకమునకు తరఫీదు ఇచ్చి, వారిచేత కొన్ని గ్రామములలో స్వార్ధపరుల అండచే నాటకములు వేయించుటకు ప్రయత్నములు చేయుచున్నాడు.

తమ పెత్తనం నిలబెట్టుకొన చూచు చల్లపల్లి ఎస్టేటువారు వీరికి మద్దతు యిచ్చారు. ఈనాటక బృందమునకు పూర్తిగా ఆర్థికసహాయం చేయుచు, దివిసీమలో అన్నిగ్రామములలో నాటకములువేయమని ప్రోత్సహించుచున్నారు. దివాను కృష్ణాజిల్లాలోనేగాక గుంటూరుజిల్లాకు చెందిన తన స్వంత గ్రామమైన గూడవల్లిలో కూడా ఆడించాడు.

వీరికితోడు తాలూకా కాంగ్రెసు ఎసెంబ్లీ కార్యదర్శి యేలేశ్వరపుకృష్ణమూర్తి కాంగ్రెసు పేరుతో ఈనాటకమును ఆడించుతున్నాడు. తానుకూడా ఈ నాటక బృందముతో ప్రతి గ్రామంవెళ్ళి అమాయకులలో యిది కాంగ్రెసు నాటకమని ప్రచారంచేస్తూ, ప్రజలను మోసపుచ్చుతున్నాడు.

గద్దె కృష్ణయ్య సహాయంతో 16వ తేదీన అవనిగడ్డలో నాటకం వేయుటకు ప్రయత్నించారు ఈ స్వార్థపరులు. ఈవిషయం చుట్టుప్రక్కలనున్న బందలాయిచెర్వు, నాగాయితిప్ప గ్రామములకు ప్రాకింది. ఆ గ్రామములనుండి రైతులువచ్చి, ఈనాటకం కమ్యూనిస్టులనేకాదు ప్రజాసేవకులను, స్వాతంత్ర్యప్రియులందరిని దూషించుచున్నదనీ, ప్రత్యేకించి దివిసీమ నాయుడుకులంలో పార్టీలుతీసుకువచ్చుటకు జమీందారు వేసిన ఎత్తుగడ అనీ ప్రచారం చేశారు. రైతువర్కర్లు స్థానిక కాంగ్రెసువాదులందరిని కలుసుకొనగా, తమకేమీ సంబంధం లేదని చెప్పారు. కాని యేలేశ్వరపు కృష్ణమూర్తి తన వ్యక్తిగత బాధ్యతపై వేయించుచున్నానని ప్రచారం చేస్తూన్నాడు. అవనిగడ్డ రైతులు వ్యతిరేకించుటవలన ఆనాడు నాటకం వేయలేదు.

ఇంతటితో తృప్తిచెందక 23వ తేదీన అవనిగడ్డలో సంతనాడు, నాటకం ప్రదర్శించ పూనుకున్నాడు. ఇదిచూచి సంతకువచ్చిన ప్రజలంతా అసహ్యించుకొని, అనాటకం ఆడవలదని చెప్పారు. ఐనా లక్ష్యపెట్టలేదు.

ఇటువంటి అవినీతిపరుల చర్యలను ఎదుర్కొని, నాటకమును అరికట్టవలసియున్నది. నాటకసమయమున కొంతమందిరైతుపెద్దలు, రైతుసేవకులు వచ్చి యీ నాటకంలోని విషయాన్నిచెప్పి మందలించారు. అంతట ముండగీష్ల ప్రజలపై రాళ్లు రువ్వసాగారు. అక్కడ ఉన్న రైతుసేవకులు ఆత్మరక్షణకు పూనుకున్నారు. రౌడీలకు, జమీందారీ ఏజంట్లకు బుద్ధిచెప్పారు.

27వ తేదీ భావదేవరపల్లినుండి కామ్రేడ్సు బుచ్చికోటయ్య, పున్నయ్య, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు బస్సులో ప్రయాణం చేస్తున్నారు. అవనిగడ్డలో గద్దె కృష్ణయ్య, కొంతమంది రౌడీలతోబస్సునుఆపి కర్రలతో సుబ్బారావు, పున్నయ్యలనుకొట్టారు. ప్రమాదమైనగాయాలు తగిలాయి.

ఇంతలో చుట్టుప్రక్కల అనేకమంది రైతులు ప్రోగై, ఈ అన్యాయానికి యెదుర్కొనపోగా గద్దె కృష్ణయ్య, తన అనుచరులతో కాళ్ళకు బుద్ధిచెప్పాడు. కామ్రేడ్సు పున్నయ్య, సుబ్బారావు, బుచ్చికోటయ్యలు కేసుపెట్టారు.

— మా విలేఖరి

# ఉప్పలూరు కరణం చర్యలు

ఉప్పలూరు కరణం పేరు శ్యామలరావు. ఈయన చాలకాలం నుండి గ్రామంలో ఒక ముఠానుగట్టి ఒకరిమీద ఒకరికి తగాదాలు పెడుతున్నాడు. బీదసాదలపైన దౌర్జన్యం చేస్తుంటాడు.

నాలుగు సంవత్సరముల నుండి పార్టీ సభ్యులు ఆ గ్రామంలో పనిచేస్తున్నారు. గ్రామంలో కరణం ముఠా చేస్తున్న దౌర్జన్యాలను ఎదుర్కొంటున్నారు. క్రిందటి సంవత్సరం కిరసనాయిల్ పంపకంలో అన్యాయం చేసి అందరికీ అందనీయలేదు. తనకు చిత్తం వచ్చినవారికి కోటాలువేసి, తన వ్యతిరేకులకు, కూలీలకు లేకుండా చేశాడు. పార్టీ సభ్యులు ఈఅన్యాయాన్ని ఎదుర్కొని తహశీల్దారు వద్దకు రాయబారంవెళ్ళి సక్రమంగా పంపకం జరిగేందుకు కృషిచేశారు.

ఎరువులు యిప్పించునప్పుడు ఫారము మీద సంతకాలు పెట్టకుండా కరణం వేధించాడు. అపుడు కూడ చాల కృషిచేసి రైతు సంఘం జయించింది.

## ప్రజాకంటకుడు

గ్రామంలో ఒక యీనాందారు పొలంలో అన్నే వెంకట్రామయ్య అనేరైతు 10 సంవత్సరములనుండి సేద్యం చేస్తున్నాడు. క్రిందటి సంవత్సరం ఆ రైతు చేలో పెంటగట్టి ఊడ్పులు వేయబోయేముందు యీనాందారు చేత మరొకరికి కవులుకు వ్రాయించుకుని వచ్చి కరణం తగాదా పెట్టించాడు. దానికి వ్యతిరేకంగా రైతుసంఘం కృషిచేసి రాజీ చేసింది.

కరణం కూలీలపైన, బీదరైతులపైన నిరంకుశంగా పెత్తనం చలాయిస్తూ ఉంటాడు. చేనేతవల్ల బ్రతికే సాలీలందరిని జడిపించి తన అదుపాజ్ఞలలో పెట్టుకునేవాడు. కాని యీ మధ్య ఆ గ్రామంలో చేనేత పారిశ్రామిక సంఘం ఏర్పడింది. దానిలో పార్టీసభ్యులు కృషిచేస్తున్నారు. కూలీ ఎక్కువ యిప్పించడానికి మాస్టరువీవర్సుకు వ్యతిరేకంగా మిగతా పారిశ్రామికులను సమీకరించారు. దానితో మాస్టరు వీవర్సు లొంగివచ్చి న్యాయమైన కూలికి అంగీకరించారు.

పాలకొల్లు, తదితర ప్రాంతాలకు నూలు దొంగవ్యాపారం జరుగుతుంటే దానికి వ్యతిరేకంగా కృషిచేస్తున్నారు. మే మూడవ వారములో బెజవాడ వరకు రహస్యంగా వచ్చిన బండిని పట్టుకుని సబ్‌కలెక్టరుకి రిపోరు చేయడం జరిగింది. కొంతమంది మాస్టరు వీవర్సు తమ తప్పును అంగీకరించి స్టేటుమెంట్సు యిచ్చారు. అనూలును గ్రామంలో పంచారు.

## రెచ్చగొట్టడం

దానితోకరణం, అతనిముఠా కమ్యూనిస్టులపై మండిపోతున్నారు. గ్రామ చేనేతసంఘ కార్యదర్శి స్టేషనునుండి వస్తుంటే 'నీవేనంటరా సెక్రిటరీవి. కమ్యూనిస్టులతో తిరుగుతున్నావట, తన్నులు తగులుతై' అని కరణం బెదిరించాడు. కరణంముఠాకుచెందిన మాస్టరు వీవరు కొల్లి అంజనేయులు బూతులుతిట్టాడు.

పిడికిటి సుబ్బారావు అనే మరొక రౌడీ నోరు పారవేసుకోవడం ఎక్కువైనది. ఆకుల బసవయ్య అనే జంగం, కామ్రేడ్‌ని 'ఈలంజాకొడుకులంతాదొంగమార్కెట్టుపట్టుకుంటారా, కమ్యూనిస్టులుంటమో, మేముంటమో తేలిపోవాలి! ఈసారి నీవుఎక్కడకన్నా బయలుదేరావంటే తన్నులు తగులుతయి' అనితిట్టాడు.

ఈ విధంగా బీదకుటుంబాలకు చెందినవారిమీద కరణంముఠా దాడి తీవ్రంచేశారు. తదుపరి అన్నే రామయ్య అనే మధ్యతరగతి రైతు బెజవాడవెళ్ళడానికి స్టేషనుకుపోతుంటే, "వెంగమ్మ నాటకం వేయించబోతున్నాము. అపుడుగాని రా! అందాకా ఎందుకు ఇప్పుడే మనమిరువురము తేల్చుకుందామురా" అంటూ తిట్టాడు. 28-5-45 తేదీన, 2-6-45 తేదీని 'వెంగమ్మ' నాటకం ఉంటుందని ప్రచారం చేశాడు. ఆరాత్రి గన్నవరం రోడ్డుప్రక్కవున్న చింతక్రింద కొంతమందిని ప్రోగుచేసి "వెంగమ్మ"పుస్తకం ఒకరుచదవటం, మిగతా ముఠావారంతా కర్రలు పట్టుకుని కూర్చుని చెప్పరాని విధాల కామ్రేడ్ సుందరయ్యను దుర్భాషలాడటం జరిగింది.

29-5-45 వ తేదీ మధ్యాహ్నం గ్రామ సత్రంలో పై రౌడీలముఠా జూదం ఆడుతున్నారు. వారి దుశ్చర్యలను గురించి అన్నే చలపతిరావు, అడుసుమిల్లి సత్యనారాయణ గ్రామంలో ప్రచారంచేస్తుంటే పై రౌడీలు దొమ్మీగా మీదపడ్డారు. వెంటనే గ్రామంలో ఉన్నవారు చాలమంది (మిగతా 8వ పేజీలో)



# బెంగాల్ దుర్గతి బర్మాకు తప్పదా?

## బ్రిటిష్ అధికారులవలంబిస్తున్న వైఖరి బర్మాప్రజల్ని అధోగతి కీడుస్తూంది

బర్మానుంచివచ్చిన తాజావార్తలు యీ వ్యాసంలో విశదీకరించబడ్డాయి. బ్రిటిష్ అధికారులు బర్మాలో తమ తొత్తుల కధికారమిచ్చి, యెలా విరంకుశ పద్ధతు లవలంబిస్తున్నారో యిందులో తెలియజేయబడింది. బెంగాల్ కరువుకి కారణమైన పరిస్థితులే బర్మాలోకూడా తలయెత్తాయి. నాణెముల చెలామణి విషయంలో బ్రిటిష్ అధికారులవలంబిస్తూన్న విధానాన్ని "స్టేట్సుమన్"వంటి బ్రిటిష్ పత్రికలే తీవ్రంగా విమర్శిస్తూన్నప్పుడు బర్మా పరిస్థితులెంత విషమించాయో అర్థంచేసుకోవచ్చు.

మాండలే తిరిగి బ్రిటిష్‌వారిస్వాధీనం కిందకివచ్చాక బర్మాలో జపాన్ సేనలునిజమైన ప్రతిఘటనఎక్కడా చూపలేదు. ఎందువల్ల? మిత్రరాజ్యాలసైనికబలమేనా ఇందుకుకారణం? సైనిక కార్యాలయం వారి ప్రకటనలలో సహితం, ప్రధానమైన యితరకారణాలు పేర్కొనబడ్డాయి. ఫిబ్రవరి 23వ తేదీ ప్రకటన ప్రకారం, యుద్ధనీతిలోను, విధ్వంసక చర్యలలోను నైపుణ్యంగల ఆరకాన్ గెరిల్లాల సహాయంతో మిత్రసేనలు జపాన్ సైనికుల్ని వెనక్కు తరుమగలిగినట్లు స్పష్టమవుతోంది. అసోసియేటెడ్ ప్రెస్ తరపున యుద్ధవిలేఖరిగా వెళ్ళిన రాజమణి రిపోర్టులో కూడా బర్మా గెరిల్లాలు జపాన్ సేనల్ని విపరీతంగా పీడిస్తున్నట్లూ, వందలకొద్దీ గెరిల్లాలు "బర్మాజాతీయ సైన్యం"లో చేరుతూన్నట్లూ, స్పష్టమవుతోంది.

## జాతీయపక్షాల నాయకత్వం

నిజంచెప్పాలంటే, బ్రిటిష్ సేనలు బర్మాలో ప్రవేశించడానికి చాల రోజులుముందే, వివిధ రాజకీయ పక్షాలకు చెందిన "బర్మా పేట్రియాటిక్ ఫ్రంట్" నాయకత్వంక్రింద బర్మా గెరిల్లాలు, ప్రజలు జపాన్ ప్రభుత్వానికి స్వస్తి చెప్పారు. ఈ "బర్మా పేట్రియాటిక్ ఫ్రంట్"లో అన్ని దృక్పథాలకు చెందిన దేశభక్తులు ఉన్నారు. కమ్యూనిస్టులు సంస్కరణవాదులు, మొదట్లో జపాన్ ఆక్రమణకుతోడ్పడి, తరవాత క్రమంగా యదార్థం తెలుసుకున్న తకీన్ విప్లవపార్టీవారు, మొదట"బర్మాస్వాతంత్ర్యసైన్యం"లో చేరిన సిపాయిలు-ఈసంస్థలో పనిచేస్తున్నారు.

వీరంతా బర్మా ప్రజలలోచేసిన స్వాతంత్ర్య ప్రబోధం ఫలితంగా, బర్మన్లు ఎన్నోబాధలకోర్చి జపాన్ సేనల్ని వెనక్కు తరిమారు. పారిపోతూ పారిపోతూ, జపాన్ అధికారులు రహస్యంగా కొందరు సైనికుల్ని వెనక ఉంచేవారు. అలాంటి వారెక్కడ వున్నారో గాలించి, ప్రజలు మిత్రరాజ్య సైన్యాధికారులకు పట్టియిచ్చారు. మిత్రవిమానాలు తరచు అట్టి ప్రదేశాలమీద బాంబులవర్షం కురిపించినప్పుడు చుట్టుప్రక్కల యిండ్లన్నీ నేలమట్టమయేవి. రైల్వేలైన్లకు సమీపంలోఉన్న పట్టణాలు, పల్లెటూళ్ళు భస్మమయేవి. ప్రజలలో 100కి 70 మంది యిళ్లులేక నానాఅవస్థలు పడేవారు. కొందరు దూరంగా ఇతర గ్రామాలకువెళ్ళి తలదాచుకోవలసి వచ్చేది. మరి కొందరు "జయాత్" అనే విశ్రాంతి భవనాలలోను, "ఫోంగీ క్యాంగ్" అనే బౌద్ధ విహారాలలోను, తలదాచుకున్నారు. మరి కొందరు బంధువుల యిళ్ళకు చేరుకున్నారు. ఈరోజున అనేక గ్రామాలలో జనసమ్మర్దం విపరీతంగా యెక్కువైపోయింది. వేలకొద్దీ ప్రజలు రోడ్లవెంట, కాలిబాటల వెంట, పడి ప్రయాణం చేస్తున్నారు. ఆర్థికంగా యించుమించు ప్రతి గ్రామం దెబ్బతింది.

## నిలవవ్యాపారస్తుల దోపిడి

బర్మా జపాన్‌పరిపాలనకింద ఉన్నంత కాలం ప్రతిసైనిక రెజిమెంటుకి ఒక్కొక్క ముద్రణాలయం ఉండేది. దానిమీద నోట్లు అచ్చువేసుకునేవారు. ఇలాఅచ్చు వేసిననోట్లతో తమకు కావలసిన వస్తువులు కొనుక్కునేవారు. బ్రిటిష్ సేనలు బర్మాలో ప్రవేశించడంతోనే, ప్రజల దగ్గరున్న యీ జపాన్‌నోట్లు పనికిరావని హుకుం జారీచేశారు. ప్రజలవద్ద బ్రిటిష్‌నోట్లు వున్నాయాయంటే, లేవు; అందువల్ల, బజారులో ఏవస్తువు కొనుక్కుందామన్నా, ఎన్నో చిక్కులు పడవలసివచ్చేది. రైతులు స్వయంగా బ్రిటిష్ సైనికాధికారులవద్దకొచ్చి, తమవద్దనున్న కూరగాయలు మొదలైనవన్నీ అమ్ముతామని ముందుపెట్టేవారు. మిలిటరీ కంట్రాక్టర్లు తాము నిర్ణయించిన ధరలకే కొనేవారు. ఈ మిలిటరీ కంట్రాక్టర్లవద్ద, కొద్దిమంది వ్యాపారస్తులవద్ద, తప్పితే మరెక్కడా బ్రిటిష్ నోట్లుగాని, నాణెములుగాని, లేవు. ఫలితం, జపాన్‌నోట్లకు మారకంగా బ్రిటిష్‌నోట్లు యివ్వడం నేడొక పెద్ద వ్యాపారం అయింది. 40 జపాన్‌నోట్లిస్తేగాని ఒక బ్రిటిష్ రూపాయి నోటు దొరకదు. మాండలేలో ఒక్కొక్క బియ్యంమూట ధర 8 రూపాయలు. అంటే 320 జపాన్ రూపాయిలివ్వా లన్నమాట! ఏప్రిల్‌నుంచి ధరలు యింకా విపరీతంగా పెరిగాయి.

ఇక ఆహారపదార్థాల విషయం. మిలిటరీ అధికారులు తమకుకావలసిన బియ్యం తామే సరాసరి కొనుక్కుంటున్నారు. ప్రభుత్వం కొని నిల్వజేయడమనేది లేదు. బర్మాను పూర్తిగా స్వాధీనంజేసుకున్నాక మిలిటరీ అధికారులే బియ్యంకొనివేస్తారని వదంతులు వ్యాపించాయి. అందువల్ల మిల్లు యజమాన్లు, షావుకార్లు రైతులవద్ద ధాన్యం విపరీతంగా కొని నిలువచేస్తున్నారు. బర్మా జపాన్‌కింద ఉన్నప్పుడు ప్రతిగ్రామంలోనుగ్రామమునసబులవద్ద సరుకు దాచుకునేవారు. ఆగ్రామ మునసబులిప్పుడు పెద్ద దొంగవ్యాపారస్తులయారు. పకోకూ, మింగ్యాంగ్, జిల్లాలు అసలేతరుగు ప్రాంతాలు. అక్కడ యిప్పుడు కరువు పరిస్థితులేర్పడ్డాయి. సివిల్ పరిపాలనాధికారులు ఈ విషయంలో యింతవరకేమీ చేయలేదు. మిచీనాలో వున్న కాందిశీకులకు ఒకసారి మాత్రం ఒక్కొక్క కుటుంబానికి ఒక చిన్న పాలడబ్బాతో బియ్యం, ఒక చెంచాడు ఉప్పు యిచ్చారు. అంతే!

## బట్టల కరువు

తిండి కరువుతోబాటు బట్టలకరువు తీవ్రరూపం దాల్చింది. బాధ్యతగల ఒక సివిల్ పరిపాలనాధికారి యిలా చెప్పాడు:

"సప్లయిలు విమానాలమీద రావడంలో ఒక్కొక్క లుంగీ ఖరీదు పదిరెట్లు పెరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించరు. అకస్మాత్తుగా సౌకర్యాలన్నీ వస్తాయని వారి ఆశ. యుద్ధం యింకా జరుగుతూన్నదనివారు గ్రహించడంలేదు. మా శక్తిలో ఉన్నంతవరకు మేము సహాయం చేస్తున్నాం. యుద్ధానికి పూర్వంవున్న పరిస్థితులు తిరిగి ఇప్పుడే రావాలనుకోడం వట్టిభ్రమ. కనీసం 30 సంవత్సరాలైనా అందుకు పడుతుంది."

బర్మాను విముక్తిచేశాక ప్రజలపట్ల నిరంకుశాధికారులు ప్రకటిస్తూన్న వైఖరి ఇది:

పోనీ, ఉన్నకొద్ది సరుకైనా ప్రజలకు సక్రమంగా అందజేస్తున్నారా అంటే లేదు. ఆరకాన్, మోనీవా, సగాంగ్ జిల్లాలలో సివిల్‌పరిపాలనాధికారులు జిల్లా కేంద్రాలలో బట్టలకొట్టులు తెరిచి, టముకు వేయించారు. వందలకొద్దీ జనం బారులుతీరి నిలబడ్డారు. ఒక ఉద్యోగస్థుడులేచి, వరుసగా గ్రామ మునసబుల పేర్లు చదవనారంభించాడు. వారందరికీ ఒక్కొక్క లుంగీచొప్పున ఉచితంగా పంచిపెట్టాడు. తమ పరిపాలనపట్ల వారి సహకారం సంపాదించడానికి అలా లంచమిచ్చి చేరదీస్తున్నారు. ఇతరులు కంట్రోలు ధరలకు కొనుక్కోవాలి. రైతులు దూర ప్రాంతాలనుంచి నడిచివచ్చి కొనుక్కోవడం బహుకష్టం. ఎందువల్లనంటే, రాక పోక మార్గాలు పూర్తిగా పాడయాయి. రెండో విషయం, తమవద్ద బ్రిటిష్‌నోట్లు, నాణెములు లేవు. అందువల్ల వర్తకులు, ప్రభుత్వ గులాములు తమ మనుష్యుల్నిపంపి, ప్రభుత్వ డిపోలలో విరివిగా లుంగీలు కొని, నిలవ చేస్తున్నారు. రహస్యంగా పిటనిఎక్కువ ధరల కమ్ముతున్నారు.

**పీపుల్స్‌వార్ నుండి**

చిత్తు అంచనాలనుబట్టి, బర్మాలో 100కి 75 చొప్పున వ్యవసాయాని కుపయోగించే పశువులు మాయమయాయి.

## అంటువ్యాధులు

చాలా ప్రాంతాల్లో మలేరియా, నంజువ్యాధి, రణములు మొదలైన అంటుజాడ్యాలు ప్రబలంగా ఉన్నాయి. రైతులు బలహీనతవల్ల, కష్టపడి పనిచేయలేకున్నారు. మిలిటరీవైద్యాధికారులు యుద్ధంలో దెబ్బలు తగిలినవారికి, బాంబుదెబ్బలు తగిలినవారికి, మాత్రమే చికిత్సలు చేస్తున్నారు. ఇదివరకు ఆస్పత్రులలో ఉద్యోగాలు చేసిన డాక్టర్లను పిలిచి, జిల్లా కేంద్రాలకు కొత్త ఆసుపత్రులు తెరవమని పంపు తున్నారు. కాని, అక్కడ మందు లేవీ! మోనీవా, ఆరకాన్ జిల్లాలలో మాత్రం కొద్దిగామందులు పంచిపెట్టారు. "ఆరకాన్ జిల్లా కంతకూ మావద్ద అరఔన్సు అగరాల్ మాత్రమేఉంది. మందుల కొరత యెంత తీవ్రరూపంలో ఉందో మీరే ఊహించుకోండి. కనుకనే, మేం ప్రస్తుతం బాంబుదెబ్బలకు మాత్రం చికిత్సచేస్తున్నాం." అన్నాడొక సివిల్ పరిపాలనాధికారి.

## తొత్తులకు పరిపాలనాధికారం

నేడు సివిల్ పరిపాలనాధికారులు తమ తొత్తులకే బర్మా ప్రజలమీద అధికారం ఇస్తున్నారు. ఆంగ్లో ఇండియన్ కాందిశీకులకు, రంగూన్ యూనివర్సిటీ విద్యార్థులకు, విరివిగా ఉద్యోగాలిస్తున్నారు. వీరిలో ఎక్కువమందికి బర్మాప్రజలంటే అసహ్యం. ఇండియాలో ఉన్నంతకాలం వీరిలో చాలమంది జపాన్‌కు అనుకూలురు. బర్మాలో యిప్పుడమలు జరుపుతూన్న పరిపాలనా విధానం మామూలుగా వలస దేశాలన్నింటిమీద రుద్దబడుతూన్నలాంటిదే. ప్రజల జాతీయోద్యమం అంటే, ఉన్న విపరీతమైన భయంతో, వీరు రాజభక్తిపరాయణుల్నీ జపాన్ అనుకూలుర్నీ, అధికారంలో కూచో పెడుతున్నారు.

బర్మాప్రజల దేశభక్తి వీరికికంటగింపుగావుంది. అందువల్ల, జపాన్‌ప్రచారానికి తోడ్పడ్డారనే సాకుతో బర్మా దేశభక్తులందరినీ జైళ్ళకు పంపుతున్నారు. పోలీసుఉద్యోగస్థులు గ్రామాలకువెళ్ళి, జాతీయభావాలు గల వ్యక్తులెక్కడైనావుంటే, వారిని"బర్మారక్షణ" (ఇండియా రక్షణచట్టంలాంటిదే) పేరుతో అరెస్టు చేయడంపరిపాటయింది. కొందరుఉద్యోగస్థులు కొన్ని ప్రాంతాల్లో జాతీయవాదుల సహకారం తీసుకొంటూన్నమాట నిజమే. కాని, ఉద్యోగాలిచ్చేసమస్య వచ్చేసరికి జపాన్‌తొత్తుల్నిగాని, బ్రిటిష్ ఏజంట్లనుగాని, ఆ ఉద్యోగాల్లో పెడుతున్నారు.

మాండలేలో యు-బా-సి అనే వ్యక్తి డిప్యూటీ కమీషనర్‌గా నియమించబడ్డాడు. పూర్వం బ్రిటిష్ పరిపాలనలో యితడు సగాంగ్ జిల్లాకు డిప్యూటీకమీషనర్‌గా ఉండేవాడు. జపాన్ పరిపాలన వచ్చాక ఈ తుచ్ఛుడు గెరిల్లా దళాల ఆచోకీ పట్టుకొని, జపాన్‌అధికారులకు భోగట్టా యిచ్చాడు. వీని ప్రోత్సాహంతోనే థీన్-దాన్ వంటి స్వాతంత్ర్యయోధులు అరెస్టుచేయబడి, చెప్పరాని చిత్రవధలకు గురిచేయబడ్డారు. అవాబ్రిడ్జి మీద కమ్యూనిస్టు నాయకుడైన థీన్-దాన్ తల నరికింపజేశాడు. ఇప్పుడు ఆ జపాను ఏజంటే బ్రిటిష్ పరిపాలినలో డిప్యూటీ కమీషనర్‌గా నియమించబడ్డాడు!

ఇదీ నేటిబర్మా పరిస్థితి. ప్రభుత్వానికిప్రజలతో సంబంధం లేదు. పెత్తనమంతాతొత్తుల చేతుల్లోను, నిల్వ వ్యాపారస్తుల చేతుల్లోను ఉంది. దేశభక్తులు జైళ్ళలో మ్రగ్గుతున్నారు. ప్రజలు నిస్పృహలోపడి, దారి తెన్నుగానక ఉన్నారు.

ప్రజానాయకుల్ని నిర్బంధాలకు గురిచేయడంవల్ల దేశంలో అరాజక శక్తులు విచ్చలవిడిగా విహరిస్తున్నాయి. దోపిడీదార్లు ఆయుధాలతో గ్రామాలమీద పడి ప్రజల్ని కొల్లగొట్టుకుంటున్నారు. వీరిని అణచడం ఒక పెద్ద సమస్యగా పరిణమించింది. ప్రభుత్వం ఇందుకు పోలీసుశాఖను రెట్టింపుకి పెంచింది. ప్రజల పౌరసత్వ హక్కుల్ని హరిస్తోంది. కాని దోపిళ్లు మాత్రం ఆగడంలేదు.

ఈవిధంగా బర్మాలో ఈరోజున బెంగాల్ లాంటిపరిస్థితులు తలయెత్తుతున్నాయి. బర్మాలో వివిధ రాజకీయపక్షాలు (మిగతా 10వ పేజీలో)

పుస్తకపరిచయం

# ప్రత్తోళి

కవితాకల్లోలినీ గ్రంధమండలిలో ద్వితీయ తరంగం యిది గేయఖండికల సంపుటి
రచయిత : శ్రీ కొనకళ్ళ వెంకటరత్నం
వెల : రూపాయి
ప్రతులకు రచయిత పేరిట "పడమటి వీధి, ఏలూరు" అని వ్రాయాలి.

★

"బంగారిమామ" "ఎండావాన," "మబ్బుసింతెలు," "నవయుగం," అనేవి ముఖ్యశీర్షికలు ఈ గేయఖండికలకు. 'బంగారి మామ' లో పల్లెటూరి యువతీయువకుల మధుర ప్రణయ జీవితం కన్నులకు కడుతుంది. పల్లెటూరి వాతావరణాన్ని చక్కని ఉదాహరణలతో చిత్రించాడు కవి. ఉదాహరణకు :

"ఎలపటెద్దు మందకొడిగ
ఎనకెనకై పోతుంటే,
దాపటెద్దు ముందరికే
తరుముకు పోతానంటది;
సద్దుకు పోవేరా మన
సంసారము సూళయినా?"

అని అంటాడు. మధురమధుర స్వప్న జీవితం నుండి ఆ దంపతులు మేల్కొని, వాస్తవిక లోకానికి వస్తారు. కరువువాత పడతారు.

"ఈన మోపై వున్న పైరులు
ఏటి మునకల పాలు జేసి,
కొంప గోడీ విడిచి, పట్టెడు
కూటికై ఊరేగవలెరా"

అని దుఃఖించుతారు.

హృదయంలో చితిపెట్టి వెడలిపోయిన పుత్రుని గురించీ, 'చీకట్ల బ్రతుకులో మణిదీపంలా' వచ్చిన అమ్మణ్ణిని గురించీ కవి పొందిన అనుభూతిని "ఎండా, వాన" చిత్రించుతుంది.

యుద్ధాలతో, క్షామాలతో, కల్లోలపడుతున్న నేటిప్రపంచంలోని పరిస్థితులను ఎంతోవాస్తవికంగాచిత్రించాడుకవి "నవయుగం"లో. "క్షుధాగ్నికుండం"లో కలకత్తా కరువు భీభత్సాన్ని హృదయం దూసుకుపోయేటట్లు వర్ణించాడు.

"కన్నతల్లి తడియారిన రొమ్మున
కక్కటిల్లు పసికందులగోడు
ఆలుబిడ్డలూ,
అన్నదమ్ములూ,
అందరికీ దవ్వై, అన్నానికి
'అలోలక్ష్మణా-' అని తిరిగే ప్రజ
అంగలార్పులూ,
ఆ క్రందనలూ,
అవిగో - అల్లవిగో—"

అంటూ ఆ భయంకర దృశ్యాలను మన కళ్ళయెదుట ఉంచుతాడు.

హిట్లరు జాతకచక్రం వెనక్కి మళ్ళిన సమయంలో వ్రాసిన 'వక్రరేఖ'లో, రాబోయే హిట్లరు పతనాన్ని గురించి సరిగా ఊహించాడు కవి.

"…. కలదీ
కల్లోల గర్భమున
అణచేస్తే అణగనిశక్తి
అరికడితే ఆగని వేగం,
చంపేస్తే చావని జీవం."

అని స్వాతంత్ర్య ప్రియమైన ప్రజాశక్తులను చక్కగా అంచనా వేస్తాడు.

సరళమైన భాషా, చక్కని నడకా, మంచి భావనాశక్తి కనపడుతోంది ఈచిన్నపుస్తకంలో.

## చేనేత కార్మికా!

చేనేత కార్మికా లేవోయ్
చేనేత కార్మికా రావోయ్—
నీచేతితో నీవు నేసియిచ్చిన పాత
నీకళ్ళకే గంత కాకుండ చూసుకో
నీశ్రేయమునుగోరి లేవోయ్
నీసంఘమున జేర రావోయ్—
విశ్వవిఖ్యాతితో వెలుగొందినట్టి నీ
దక్కామజ్లిను మాట తలపునకు దెచ్చుకో—
పనితనము నీచేతిదేనోయ్.
ఘనత మును నీనేతదేనోయ్—
కలవారి మానమ్ము కాపాడు పనివాడ,
కలదా నీమానమ్ము కాపాడుకొనుజాడ—
నీసంకెలలు ద్రెంప లేవోయ్.
నీసంఘమును నిల్ప రావోయ్:—
పెట్టుబడిదారులకు కట్టుబడి యెన్నాళ్ల
పుట్టిమునిగీనట్లు పొట్టమాడ్చుకొనేవు?
కనకట్టులను దెలిసి లేవోయ్.
కనుగట్టి ముందునకు రావోయ్—
దొంగమార్కెటు నిన్ను మ్రింగివేస్తున్నాది
లంఘించి విరిచి నీసంఘాన్ని నిల్పుకో:
రంగేది? రంగునూలేదీ?
నూలుకే నోచుకో లేదా?—
అన్నమని వెన్నాడు ఆలుబిడ్డలగోడు
నేయ నూలే లేని నీగోడునకు జోడు
గోడులన్నిటనుండి ముక్తి,
నానాట నీసంఘశక్తి—
చేనేత కార్మికా లేవోయ్.
చేనేత కార్మికా రావోయ్—

— ప్రయాగ కోదండరామశాస్త్రి

## సంగీతం

●

— "భ. రా"

భారతీయ పౌరునకొక
పదిదబ్బులె రోజు కూలి
బ్రతుకెల్లా గడుస్తుంది ?
యోచించే యోధుదేడి ?
రోదించే భరతజాతి
నిస్స్వరపు గీతం -
మా దరిద్ర సంగీతం -

పేదవాని రక్తమంత
పీల్చి పీల్చి పిప్పి విడచి
జలగ జీవితం గడిపే
శ్రీమంతుల, ధీమంతుల,
బడాయి భాగవతం -
మా దరిద్ర సంగీతం -

తన నెత్తురె పదునుపెట్టి,
పాషాణపు నేల దున్ని,
పండించే వరిగింజకు
మొగంవాచి, సగమయ్యిన
కూలివాని దీనత్వం -
మా దరిద్ర సంగీతం -

జాతులన్ని కుళ్ళిపోయి
సాధించిన దుర్గంధం
విరుగుడుతో శుభ్రపరచి,
తుప్పట్టిన, బానిసప్రజ,
శృంఖలాల ఛేదనలో
వినదించే మౌనఘోష -
మా దరిద్ర సంగీతం -

## విజయరష్యా

— అడివి బాపిరాజు.

ఓ నేస్తకాడ - ఓ దేశమే నీవయినవాడ
నీ వేలె నువ్వుగామూర్తించి - నీ నదులె నీ శక్తిగామారి
వేలాది మైళ్ళయిన - శాలిభూమి బయళ్ళ
కాలాల ప్రవహించు గంభీర గోప్యాలు
నీ శ్లావానికజాతి నిశ్చలత్వంలోని
ఉత్తమోత్తమ ఝరీ వోల్గా మహానదిని
ఉత్తుంగ శిఖరితము ఊరలు నగశ్రేణి
నీ దివ్య భావాల నీ కర్మ తత్వమ్ము
నేను గావచ్చెరా నేలలన్నిట ప్రాకె
నిత్యమై నిల్చెరా జ్వాలయై వెలిగెరా

●

ఓ నా నేస్తకాడా ! ఓ రాతి మనిసివాడా !
ఓయి ధీర పరాక్రమాలవాడా !
బంగారు జోళ్ళతో బానిసల చబుకుతో
కాళ్ళ రాసిరి నిన్ను తోళ్ళాడగొట్టారు
ప్రభువుల్లు డ్యూకులూ బారనులు వైకౌంట్లు
గ్రాండు డ్యూకులూ ప్రిన్సు కౌంట్లు మాంక్లు బిషప్లు
క్షమామూర్తివై భరించినా వాదారుణత్వాన్ని
కృపామూర్తివై భరించినా వారాక్షసత్వాన్ని

●

ఎంతకాలం నీకు ఓరిమి ఎంతకాలం నీకు తాలిమీ
ఓ నేస్తకాడా ! ఓయి భారాలు మోయువాడా !
ఒక్కడు మహాయోగి ఉజ్వల చరిత్రుడట
ఒక్కడు మహాత్యాగి ఉజ్వల విజేతయట
అతడు లెనిన్నూ ! ఇతడు స్టాలిన్నూ!
దెసల మోయించారు దివ్య శంఖుల వారు
సంతతోదయ చిహ్న సంతతో జ్వలవహ్ని
రక్త జండా నెత్తినారు రాగమెల్లడ నింపినారు-

●

దేశాలమ్రింగేటి కాంక్ష, దేశ స్వాతంత్ర్యాల అంక్ష,
జాత్యహంకారాల హుంకరింపుల పొగరు, జాతివృద్ధికి దీక్ష పూయు రంగులతొగరు
రెండు రెండూ తగిలి రెండు రెండూ పగిలి
లోకాల ప్రళయాంత భీకర మహారణము
ఏకమై మండించి యెదురుకొన్నది నిన్ను ఓ నేస్తకాడా !
దీప్త హృదయా! వచ్చినది రాకాసి చొచ్చినది నీనేల
పచ్చబంగరు పంట భగ్గుమని మండించె
చిన్నబిడ్డల విరిచినాదీ కన్న తల్లుల మ్రింగినాది
మగవాడు కనబడితె మారియైమింగేసినాదీ
దేశమెల్లలు పొంగినావూ, ఆశవెల్లలు వెలిగినావూ
బాలికలు పాపల్లు పాపలా తల్లులు
పండిపోయిన వయసువారైన వృద్ధులూ,
మొనలొగ్గి కివిచారు వారూ! ఇనుప గుండెల పూనినారూ!
ఓ నేస్తకాడా ! ఓ రాతివాడా!
ఏనాటి దీ విక్రమమ్మూ, ఏ నేల దీ విజయ రథమూ

●

జాతి రాక్షసభావ మణచినావూ జయ మహావేగాన పొంగినావూ
మంగోలు జాతులూ మధ్యేసియావారు
ముస్లింలు, క్రైస్తవులు, బుద్ధ పూజలవారు
అందరొక్కటిగాగ మీరూ, అందరై నేలేలుతారు
లేవు తేడాలేమి, రావు అడ్డాలేమి
దేశాల నీకాంతి, దేశాల నీగీతి - దివ్యమై వెలిగించు, దివ్యమై నిండించు.

( "మీజాన్" ప్రత్యేక సంచికనుండి )



# వ్యవసాయశాఖలో అక్రమాలు

బాపట్ల తాలూకా రైతుసంఘ సంయుక్త కార్యదర్శి చల్లా కోటేశ్వరరావుగారిలా ప్రకటిస్తున్నారు :

మా తాలూకాలో వ్యవసాయశాఖవారు శ్రేష్టమైన వరివిత్తనము లంటూ అమ్ముతున్న విత్తనాలు కేళీలతోను, యితరరకముల తోను నిండియుండి, విత్తనాలకు ఉపయోగపడ్డంలేదు. గత సంవత్సరం యిలాంటి విత్తనాలు బస్తాలకొద్దీ మిల్లుల కమ్మివేయవలని వచ్చింది. అంతేగాక, రైతులు ఎరువులు, తక్కావీ అప్పులు అడిగితే విత్తనాలుకొంటేనే యిస్తామంటున్నారు.

ఇక, వ్యవసాయశాఖద్వారా యిచ్చే ఇనుప పనిముట్లు బ్లాక్‌మార్కెటు రేట్లతో పోటీచేస్తున్నాయి : మొట్టమొదట అర్జీలుపెట్టుకున్న వారికి యివ్వకుండా, మొన్నమొన్ననే పెట్టిన తమ యిష్టులకు పనిముట్లుయిస్తున్నారు. గత సంవత్సరం ఆమోనియా పంపకం సందర్భంలో మేస్త్రీ శేషయ్య లంచాలు తీసుకున్నట్లు ఉప్పలపాలెం రైతులు జిల్లా అధికారికి తెలియజేసినప్పటికీ, కేసు రుజువుకాలేదంటూ కొట్టివేశారు.

ప్రభుత్వం వెంటనే తాలూకా వ్యవసాయ శాఖవారి అక్రమాలను అరికట్టి, రైతులకు న్యాయం కలుగజేయ వలసిందని కోరుతున్నాను.

## గన్నవరం తాలూకా

గన్నవరం తాలూకా రైతుసంఘాధ్యక్షులు అట్లూరి శ్రీమన్నారాయణగారిలా రాస్తున్నారు :

ఎక్కువగా పంటలు పండించుటకుగాను మంచి విత్తనములు, ఎరువులు ఉపయోగించవలసినదిగా రైతులలో గన్నవరం తాలూకా రైతుసంఘం నాల్గు సంవత్సరములనుండీ తీవ్రప్రచారం చేసింది. దాని ఫలితంగా రైతులు ఎరువులు, మంచి విత్తనములు, వాడుట కలవాటుపడ్డారు. గత సంవత్సరం షుమారు లక్షరూపాయల ఎరువులను రైతుసంఘాల ద్వారా నడుపబడే కో - ఆపరేటివ్ స్టోర్సు ద్వారాగానీ, వ్యవసాయడిపార్టుమెంటు యిచ్చే అప్పుల మూలంగాగానీ, రైతులకు పంపకం చేయడం జరిగింది. ఈ సంవత్సరం కూడా స్టోర్సు ద్వారా నిల్వచేయడం జరిగింది. కాని వ్యవసాయ డిపార్టుమెంటు రైతులకిచ్చే అప్పుల విషయంలో యెక్కువ శ్రద్ధతీసికొన్నట్లు కనిపించుటలేదు. వ్యవసాయ తరుణం దగ్గరపడింది. కాలువలు వచ్చినా, వర్షాలు కురిసినా, మాగాణీ గ్రామాలకు బండ్లుపోయే సౌకర్యములులేవు. ఈలోగానే ఫారములు పూర్తిచేయించుట, అప్పులు మంజూరు చేయుట, రైతులు ఎరువులు తీసుకొనివెళ్ళుట జరుగదు. బీద రైతులు చాలా యిబ్బంది పడతారు. పంటకు నష్టం కలుగుతుంది. దీనిని తాలూకా వ్యవసాయ డిమాన్‌స్ట్రేటరుగారు గుర్తించినట్లు లేదు. అన్ని తాలూకాలలో ఫారములు విరివిగా పంచుతుంటే, యీ తాలూకాలో ఫారములు లేవు. దీని విషయమై మే 16 వ తేదీన మేము తాలూకా డిమాన్‌స్ట్రేటరుగారిని కలుసుకొని మాట్లాడినప్పుడు, ఫారముల కొరకు తాము ఎక్కువ ఆందోళన చేస్తున్నామని, పై నుండి తమకు ఎక్కువగా సప్లయిఅగుట లేదని, ప్రస్తుతం 300 ఫారములు మాత్రమే వచ్చాయని, వాటిని ఒక్కొక్క ఫిర్కాకు 75 ఫారముల చొప్పున పంచుతున్నామని, చెప్పారు. కాని ప్రతి ఫిర్కాకు ఆ 75 ఫారములైనా వచ్చాయా అంటే, లేదు. 30 ఫారములు మాత్రమేపంపారు. 30 ఫారములంటే, ఒక్క గ్రామమునకు కూడా చాలవు. రైతుల ఆందోళన డిమాన్‌స్ట్రేటరుగారి చెవికెక్కుట లేదు. ఇదేవిధంగా యింకా 15 రోజులు గడిస్తే, ప్రభుత్వం యిచ్చే అప్పులను రైతు లేవిధంగానూ ఉపయోగించుకోలేరు. కావున పై అధికార్లు వెంటనే తాలూకా డిమాన్‌స్ట్రేటరుగారి ఉపేక్షాభావమును తొలగించి, ఫారములను విరివిగా సప్లయి చేయించవలసిందని కోరుచున్నాను. గ్రామ రైతుసంఘాలు యీ విషయంలో ఎక్కువ ఆందోళన చేయవలసి ఉంది.

# సంఘశక్తికి విజయం

●

కామ్రేడ్ బి. హెచ్. వి. సుబ్బారావు యిలా తెలియజేస్తున్నాడు :

వసంతవాడ ఏలూరు తాలూకాలో ఒక పెద్ద గ్రామం. ఇక్కడి చిన్నరైతులు పరిసరగ్రామాలలో భూములు మక్తాకుతీసుకొని, సేద్యం చేస్తున్నారు. కాని, వారిలో వారికి చీలికలుండడంవల్ల, ఒకరి భూముల మీద మరొకరు పోటీచేసి, విపరీతమైనకౌలురేట్లను అంగీకరించడం, కౌలునియమాలను అమలు జరపలేక అవస్థలుపడ్డం - మామూలయింది.

ఈ యేడాది యీప్రాంతంలో పంట కొంత దెబ్బ తినడంచేత, భూస్వాముల కీయవలసిన కట్టుబడిధాన్యం మరీతక్కువై, తీవ్రనష్టాలకు గురిఅయారు. క్రిందటి సంవత్సరమే గ్రామ రైతుసంఘం రైతులందరినీ సమావేశపరచి, పోటీలవల్లవచ్చే అరిష్టాన్ని గురించి నొక్కి చెప్పింది. రైతులు తమ కష్టసుఖాలను భూస్వాములకు తెలియజేసే నిమిత్తం ఒక కమిటీని ఎన్నుకున్నారు. తమంతట తామే పెంచుకున్న కట్టుబడి రేట్లను తగ్గించమనీ, భూమియొక్క సారాన్నిబట్టి రేట్లు నిర్ణయించమనీ, కోరుతూ తీర్మానం గావించారు. ఎరువులు, నీటి సౌకర్యం, మరమ్మతులు - మొదలైన విషయాల్లో ఎవరుమట్టుకువారు ఉపేక్షాభావం ప్రదర్శించటంవల్ల పంట ఎలా దెబ్బ తింటుందో, గ్రామానికి అది యెలా నష్టమో, కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు విశదీకరించి చెప్పాడు.

ఈ నిర్ణయం జరిగిన తరవాత 3 నెలలు గ్రామరైతుసంఘం ఐక్యతయొక్క ప్రాధాన్యతను గూర్చి ప్రచారం చేసింది. స్వార్థపరులైనకొందరు భూస్వాములు ఐక్యత రాకుండా చేయడానికి గావించిన ప్రయత్నాలు విఫలమయాయి. చివరకు, ఎకరం 1కి 1 బస్తా, అరబస్తా చొప్పున రైతులు కట్టుబడి ధాన్యపు రేట్లను తగ్గించుకొన గలిగారు. గ్రామం మొత్తంమీద యీ విధంగా 700 బస్తాలు తగ్గాయి. అయితే, కొద్దిమంది భూస్వాములు రైతుల్ని సాధించడంకోసం కౌలుకిచ్చిన భూమినితిరిగి తీసుకొంటున్నారు. వారుకూడా యితర గ్రామస్థులతోబాటు రైతులుకోరే న్యాయమైన హక్కుల్ని గుర్తించి, తిరిగి తమ భూములను కౌలుకీయ వలసిందని కోరుతున్నాను.

## వ్యవసాయ కూలీలలో కలహం - రాజీ

ది 20-5-45వ తేదీన తాటికాయలకొరకు త్రాగివచ్చిన యిద్దరు పాములపాడు, సోమవరప్పాడు వ్యవసాయకూలీల మధ్య చిన్నికజ్జా జరిగింది. ఇది పెద్దదయి, ఉభయ గ్రామాల వ్యవసాయ కూలీలమధ్య కొట్లాట క్రిందకు మార్పుచెందింది. సోమవరప్పాడు మునసబుగారు గుడివాడ సబ్‌ఇన్‌స్పెక్టరుగారికి టెలిగ్రాము యివ్వగా, సాయుధ పోలీసుదళం వచ్చింది. పాములపాడు వ్యవసాయ కూలీలను స్టేషన్‌లో హాజరుపెట్టుటకు పాములపాడు రైతుసేవకులు హామీ యిచ్చినారు. రెండు గ్రామాల కూలీల్లో ఒకరికొకరికి దగ్గరబంధుత్వం వుంది. ఇట్టి పరిస్థితిలో తాలూకా రైతుసంఘంవారు ఉభయపార్టీల మధ్యరాజీచేయుటకు ప్రయత్నించారు. సోమవరప్పాడు మునసబుగారుకూడా రాజీకిఅంగీకరించారు. ఉభయపార్టీలవారు తాముచేసినతప్పు నుగ్రహించి, పశ్చాత్తాపం చెందారు. కేసులు లేకుండా చేయవలసిందని కోరారు. కాని, స్వార్థపరులు (రావులపాడు కరణం రామారావు, కోర్టుపక్షి) తగాయిదాను పెంచి, డబ్బు గుంజుటకు ప్రయత్నించాడు. పోలీసులకు కనీసం రు 500/- లు రు 300/- ఉభయులు యిస్తే పోలీసుకేసు పోతుందని వేసం సాగించాడు. రైతుసంఘంవారు యిదంతా గమనించారు. ఉభయుల తరపున వెళ్ళి పోలీసులతో ఉభయపార్టీలు రాజీపడినారని, కేసులు యెత్తివేయవలసిందని, చెప్పారు. ప్రొబేషనరీ సబ్‌యిన్‌స్పెక్టరుగారు కూడా కేసులు ఎత్తివేయించుటకు ప్రయత్నించారు. ఆఖరికి పోలీసులు కేసు యెత్తివేసుకున్నారు. స్వార్థపరులఆటలు సాగలేదు. కూలీలు కేసుల కూపంనుండి బైటపడినామని సంతోషించారు.

# జీర్ణించిన అంటువ్యాధులు ఇంకా ఎక్కువగావున్నాయి

## విశాఖజిల్లా పీపుల్సురిలీఫ్‌కమిటి సూచనలు

17—5—45 వ తేదీన విజయనగరంలో విశాఖజిల్లా పీపుల్సు రిలీఫుకమిటీ శ్రీ పాలకోడేటి గురుమూర్తిగారి అధ్యక్షతను సమావేశమైంది.

కార్యదర్శి కోడుగంటి గోవిందరావుగారు కమిటీచేసినపనినిగూర్చినివేదికనిస్తూ, ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఫెడరేషను పంపిన 9 మంది వలంటీర్లు, మరి 8 మంది స్థానిక వలంటీర్లు యింతవరకు ఉత్తరవిశాఖలో పీపుల్సు రిలీఫ్ కమిటీతరపున వైద్యసహాయాన్నందజేశారనీ, సోంపేట, నౌపాడ, ఋషికుద్ద కేంద్రాలలో ఉంటూ సుమారు 80 గ్రామాలలో లెక్కలు తీయడం, మందులివ్వడం, మొదలయినవి చేశారనీ చెప్పారు.

నౌపాడ, సోంపేట ప్రాంతాలలో, సుమారు 1000 పాతబట్టలు పంచబడ్డాయి. కాని ఇంకను గుడ్డకు కరువు తీరలేదన్నారు.

ఇండియన్ మెడికల్ ఎసోసియేషన్, పీపుల్సు రిలీఫ్‌కమిటీ, సర్వెంట్సు అఫ్ ఇండియా సొసైటీ మొదలగు సంస్థల కృషివల్ల ప్రభుత్వం చాలావరకు కదిలిందని చెప్పారు.

ప్రభుత్వం పంపిన మెడికలువానులు (మందులు పంచిపెడుతూ వెళ్ళే బస్సు) తగినంతగా పనిచేయడంలేదు. కోస్తాఅంతటా 10, 15 కేంద్రాలలో హాస్పటల్సుపెట్టి, వలంటీర్లను జీపు (ఇసుకలో పరుగెత్తకల్గిన కారులు) మీద పంపుతూ, గ్రామగ్రామానికి మందులివ్వాలని సూచించారు.

అంటురోగాల పరిస్థితినిగూర్చి చెబుతూ వలంటీర్ల రిపోర్టులనుబట్టి ప్రస్తుతం జీర్ణించిన మలేరియా, కురుపులు, బల్ల జబ్బులు యింకా చాలా ఎక్కువగా వున్నాయనీ, చాలాకాలం వైద్యసహాయం అవుసరమనీ చెప్పారు.

దీనితోబాటు తక్షణం ప్రభుత్వం పల్లీలకు ఉచితంగా చేపవలలు సప్లయిచేయాలనియూ, కాందిశీకులకు రోడ్డుపని మాన్పించి వెంటనే చెరువుల మరమ్మతు చేయించాలనియూ, ఇవన్నీ జరిగినగాని రాబోయే సంవత్సరంలో నైనా కరువు రాకుండా చేయడం అసంభవమనీ - చెప్పారు.

తరువాత యీక్రింది తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

1. ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ 9 మంది వలంటీర్లను ఉత్తర విశాఖకు పంపి, కరువు నివారణకు ఆదర్శమైన కృషిచేస్తూ తోడ్పడుతున్నందుకు ఈకమిటీవారు వారిని అభినందిస్తున్నారు.

2. అంటురోగాలతో ఉత్తర విశాఖలో పీడించబడుతున్న తోడిమానవుల ప్రాణాలు కాపాడుటకై 4 గురు మెడికల్ విద్యార్థులను తమ స్వంతఖర్చులమీద పంపి, విద్యార్థిలోకానికి ఆదర్శప్రాయమైన మద్రాసు విద్యార్థి సంఘానికి కృతజ్ఞత తెల్పుతూ, అనేకకష్టాల కోర్చి మహత్తరసేవ జేస్తున్న మెడికల్ వలంటీర్లకు హృదయపూర్వకాభివందనాలర్పిస్తున్నారు.

3. జులై ఆఖరు వరకు 9 మంది స్థానిక వలంటీర్లచే ఉత్తర విశాఖలో వైద్యసహాయాన్ని కొనసాగించాలని తీర్మానించారు.

4. విశాఖజిల్లా పీపుల్సు రిలీఫ్‌కమిటీ తరపున నౌపాడాలో నడుపుతున్న ఉచిత భోజనశాలను జూలై ఆఖరువరకు నడపాలని తీర్మానిస్తూ, దాని ఖర్చులకై రు. 750 లు కమిటీ విరాళములనుండి మంజూరు చేశారు.

★

ఆంధ్ర మెడికల్ ఎసోసియేషన్‌వారు ఉత్తర విశాఖలో గావిస్తున్న వైద్యసహాయ కృషికి మద్రాసు ప్రభుత్వం రు. 5000 లు వాయిదాల వారీగా యివ్వనిశ్చయించినట్లు శ్రీ ఎం. వి. కృష్ణారావుగారు (కార్యదర్శి) తెలియజేస్తున్నారు.

# దొంగవ్యాపారికి పరాభవం

బెజవాడ తాలూకా ఉప్పలూరు గ్రామంలో యిద్దరు లైసెన్సు పొందిన నూలువర్తకులు, 5, 6 గురు మాస్టరువీవర్సు వున్నారు. పై రెండుకొట్లక్రింద నూలుతీసుకునే సుమారు 450 మగ్గాలున్నాయి. నూలుకంట్రోలువచ్చినదగ్గర్నుంచి ప్రతి వీవరుకు రేషన్‌కార్డు పద్ధతిమీద నూలు సప్లయి చేయబడుతుంది. వీదలైన వీవర్సు నూలు కొనుగోలుశక్తిలేక మాస్టరు వీవర్సు చేతుల్లో పడ్డారు. ఇక మాస్టరు వీవర్సు లైసెన్సుదార్లను పెడుతున్న పాట్లు చూడండి: వీవర్సుయొక్క రేషను కార్డులు మాస్టరువీవర్సువద్దనే వుంచుకుంటూ, ఆకార్డులద్వారా వచ్చే నూలులో తక్కువ భాగము మాత్రమే వీవర్సుచేత నేతనేయిస్తారు. మిగిలినదంతా దొంగమార్కెట్టులోఅమ్ముతూ వుంటారు. వీవర్సుచేత నేయిస్తే వచ్చేలాభాలకన్నా, నూలును దొంగమార్కెట్టులో అమ్మి అధిక లాభాలను గుంజుకోవడమే వీరి ప్రధానాశయం. ఇట్టి పరిస్థితిలో గ్రామ చేనేతసంఘ వర్కర్లు, కమ్యూనిస్టులు, కలిసి పై దొంగ వ్యాపారాన్నరికట్టి, చేనేత కార్మికులకు సక్రమముగా నూలు అందజేయుటకు పూనుకున్నారు.

21—5—45 వ తేదీన పాలకొల్లు ప్రాంతం నుండి దొంగవ్యాపారులు రావడం, మాస్టరు వీవర్సు గుసగుసలు, చేనేతసంఘ వర్కర్లు కనిపెట్టారు. ఆరాత్రే బెజవాడకుగాని, కంకిపాడుకుగాని, నూలు బండిమీద పోతుందని అచోకీ తీశారు. రాత్రి 8 గంటలయ్యే సరికి రైతుసంఘవర్కర్లు 6, 7 దళాలుగా బయలుదేరి గ్రామంచుట్టూ దూరంగాకాపలాకాశారు. కాని, ఆరాత్రి పెద్ద గాలీవాన రావడంవల్ల ఒకవైపున కాపలా కాసిన వర్కర్లు అశ్రద్ధగా వున్నారు. ఆ దేసమయంలో, అటునుంచేబండిమీద 25 పెట్టెలు నూలు ఎగుమతి చేసుకొని దొంగవ్యాపారులు బెజవాడ బయలుదేరారు. ఈ సంగతి తెలుసుకొని నేను, యింకాకొంతమంది రైతుసంఘ వర్కర్లు కలసి బెజవాడ వైపుబయలుదేరాము. మాచవరంవద్దకువచ్చే సరికి నూలు పెట్టెలతో వున్న బండిని పట్టుకున్నాం. బండివానిని అడుగగా, "పెద్ది రామకోటయ్య, వంగర రాధాకృష్ణమూర్తిగారలు, నాబండిమీద ఈసామానువేసి, నిడమానూరు స్టేషనువరకు నాబండిమీద వచ్చి, అక్కడనుండి మేము రైలుకు వస్తాము. సరుకు బెజవాడ చేర్చవలసినదిగా చెప్పినార"ని స్టేటుమెంటు యిచ్చాడు. ఆబండిని బెజవాడ తీసుకొనివచ్చి రిపోర్టువ్రాసి, బండితో సహా సబ్‌కలెక్టరుగారి ఎదుటపెట్టాం వారు, రిపోర్టుతీసికొని రేపు వుదయం రావలసినదిగా చెప్పారు. ఇంతలో ఆదొంగవ్యాపారస్తులు కూడా మావద్దకు వచ్చారు. తెలియక చేశామని, మరల ఉప్పలూరు గ్రామం తీసుకొనివెళ్ళి కంట్రోలు ధరకే నూలును అమ్ముతామని క్షమార్పణ కోరుతూ కేసును తీసివేయించవలసినదిగా స్టేటుమెంటు వ్రాసియిచ్చారు. నూలు దొంగమార్కెట్టుకు పోకుండా చేనేత కార్మికులకు సక్రమముగా అందజేయుటే మా ప్రధానోద్దేశము కాబట్టి, అందుకు అంగీకరించాము. ఆ బండిని ఉప్పలూరు గ్రామం తోలించుకొనివెళ్ళి బహిరంగ ప్రదేశములోవుంచి - దొంగనూలు కంట్రోలుధరకు అమ్మబడుతుంది, కావలసిన వీవర్సు తీసికొని వెళ్ళవలసినదిగా - అందరికి తెలియచేశాము. ప్రజలు, వీవర్సు చాలామందివచ్చి, దొంగవ్యాపారులను చూచి, ప్రజాద్రోహులని అసహ్యించుకున్నారు. చేనేతసంఘ వర్కర్ల కార్యదీక్షను కొనియాడారు. నూలును కంట్రోలు ధరకు 28 మంది వీవర్సుకు పంచి, ఓచర్సు తీసుకున్నాము. ఈ పైవిషయాలను తెలియజేస్తూ లోగడ పిటిషను రద్దుపరచవలసినదిగా సబ్‌కలెక్టరుగారికి పిటిషను దాఖలు చేశాము. ఈ పరిస్థితిలో గ్రామంలో మాస్టరు వీవరు అయిన చౌదరమ్మగారు చేనేతసంఘ వర్కర్లకు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా కుట్రలు జరపబోయాడు. కాని ఆటలేమీసాగలేదు. ఇప్పుడు నీచప్రచారానికి ఒడికడుతున్నాడు. నిజ పరిస్థితులను తెలుసుకొన్న ప్రజలు, నేత కార్మికులు ఇతనినోరు మూయిస్తారనడానికి సందేహం లేదు.

— ఆడుసుమిల్లి సత్యనారాయణ

# ప్రగడ కోటయ్య అల్పబుద్ధి

బాపట్ల తాలూకా చేనేత పారిశ్రామిక సంఘం శ్రీ సజ్జా భాస్కరరావుగారి అధ్యక్షతను సమావేశమై చేసిన తీర్మానములు :

మే నెల చివరివారములో బాపట్లతాలూకా చేనేత పారిశ్రామిక తృతీయ మహాసభను పందళ్ళపల్లి గ్రామంలో జరుపుటకు క్రిందటి సమావేశంలో తీర్మానించియున్నాము. కాని అనివార్యములైన కారణములచే మేనెల చివరవారములో ఈ మహాసభను జరుప వీలుకాలేదు. మహాసభను జరుపుతేదీ తరువాత నిర్ణయింపబడునని యీ సభవారు తీర్మానించుచున్నారు.

బాపట్ల తాలూకా చేనేత పారిశ్రామిక తృతీయ మహాసభకు ప్రగడ కోటయ్యగారిని పతాకోత్సవంచేయమని అహ్వానించగా, సభా ప్రారంభకులుగా ఆహ్వానించబడిన శ్రీ పుత్సల సత్యనారాయణగారు కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు గావున, వారిని అహ్వానించుట మానవలెనని జాబు వ్రాశారు. శ్రీ సత్యనారాయణగారు ఆంధ్రరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘ స్థాపకులలో ఒకరుగా వుండి, చేనేత ఉద్యమానికి సేవచేశారని ప్రగడ కోటయ్యగారే మండపేట సభలో చదివిన తమ కార్యదర్శి నివేదికలో వ్రాసుకొనియున్నారు. అట్టి సత్యనారాయణగారు యెలాంటి రాజకీయాభిప్రాయాలు కలవారైనప్పటికీ ప్రథమమున ఆంధ్ర రాష్ట్రంలో చేనేత సంఘాన్ని స్థాపించి, ప్రథమ సంవత్సరం కార్యదర్శిగా వుండడమున్నూ, అప్పటినుండి చేనేత ఉద్యమంలో శక్తివంచనలేకుండ చేస్తున్న సేవను, ఈసభవారు గుర్తించుచున్నారు. అదియుగాక, తూర్పుగోదావరి జిల్లా చేనేత పారిశ్రామిక సంఘానికి ఆర్గనైజరుగాను, మండపేట సభకు అహ్వానసంఘ కార్యదర్శిగాను ఉన్నారు. అట్టివారి తర్వాత నాయకత్వంలోకి వచ్చిన రాష్ట్రకార్యదర్శి శ్రీసత్యనారాయణగారిని గౌరవించేదానికిబదులు, వారిని మన తాలూకాసభకు అహ్వానించగూడదని వ్రాసినందుకు ఈ సభవారు విచారించుచూ, సత్యనారాయణగారిని తప్పక మహాసభకు అహ్వానించవలసినదిగా తీర్మానించుచున్నారు.

2-5-45 తేదీన చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘంవారు నిడుబ్రోలులో సమావేశమై, యంత్ర పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారనే నెపంతో కమ్యూనిస్టులను, రాయిస్టులను చేనేత పారిశ్రామిక సంఘంలో ప్రాథమిక సభ్యులుగా వుండకూడదని తీర్మానించడమున్నూ, అలా చేయవలసినదిగా రాష్ట్ర కార్యదర్శి శ్రీ ప్రగడ కోటయ్యగారు ఈ సంఘాధ్యక్షులకు జాబు వ్రాయడమున్నూ, ఈ సభవారు గమనించారు. రాష్ట్ర కార్యవర్గమువారు తీసికున్న ఈ నిర్ణయము చేనేత సంఘాల్లో చీలికలకు కారణమౌతుందనిన్నీ, దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనేది ఒక్క కమ్యూనిస్టులు మాత్రమేగాక, కాంగ్రెసువారుకూడ నేషనల్ ప్లానింగు కమిటీ వగయిరాల ద్వారా విశదం చేశారనిన్నీ, యిలాంటి తీర్మానము చేయడానికి రాష్ట్రమహాసభ వారికి మాత్రమే అధికారమున్నదిగాని కార్యవర్గం వారికి అధికారము లేదనిన్నీ ఈసభవారు అభిప్రాయపడుతూ, కమ్యూనిస్టులను - రాయిస్టులను చేనేత సంఘాల్లోనుండి తొలగించాలనే తమ తీర్మానమును ఉపసంహరించుకోవలసినదిగా రాష్ట్ర కార్యవర్గమువారిని కోరుచున్నారు.

నూలు రేషన్ స్కీముప్రకారం ప్రతినెలకు నెం. 40 రు నూలు 30 పౌనులు సప్లయి చేయవలసియుండగా, ఈ తాలూకాలో నేతవారికి మేనెలలో సుమారు 10 లేక 15 పౌనుల నూలు చొప్పున మాత్రమే సప్లయి చేయబడ్డది. ఇందువల్ల ప్రతిమగ్గము ఈ నెలలో 15 దినాలు పనిలేకుండ వుండవలసి వచ్చింది. గుడ్డకు కరువుగానున్న ఈసమయములో దేశానికిగావలసిన గుడ్డ వుత్పత్తి తగ్గిపోయింది. అందుచే వచ్చేనెలనుండి మామూలుగా సప్లయి చేయవలసిన కోటాప్రకారం నెల 1 కి 30 పౌనులకు తగ్గకుండ సప్లయి చేయవలసినదిగా ఈ సభవారు గుంటూరు జిల్లా నూలు కంట్రోలు ఆఫీసరుని (చీరాల) కోరుతూ తీర్మానించుచున్నారు.

# బెజవాడ రైల్వే కార్మికులు సాధించిన విజయాలు

బెజవాడ రైల్వే హాస్పిటలులో లోగడ రోగులుండుటకు 10 పక్కలే వుండేవి. ఇప్పుడు హాస్పిటలును పెంచడం మూలంగా పక్కలసంఖ్యకూడా 30 కి పెరిగింది. ఇది కాక రోజూ మందుకొరకు హాస్పిటలుకు వచ్చే కార్మికుల సంఖ్యకూడా పెరిగింది. అందువల్ల లోగడవుండే ముగ్గురు డ్రెస్సర్లు కాక అదనంగా మరొక యిద్దరు డ్రెస్సర్లను నియమించాలనీ, రోజుకు 12 గంటలపనిని తగ్గించి 8 గంటల పనిని పెట్టవలసిందని యం. యస్. యం. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్‌యొక్క బెజవాడ బ్రాంచి అనేక బహిరంగసభలలో ఆందోళనచేసింది. యూనియన్ సెంట్రల్‌కౌన్సిలుచేతపై అధికారులకు విజ్ఞప్తి చేయించింది. యూనియన్ సాగించిన ఆందోళన ఫలితంగా మరొక ఇద్దరుడ్రెస్సర్లను, రోజుకు 8 గంటల పనిని, వారానికి ఒకరోజు శెలవును (లోగడ యీ శెలవు వుండేదికాదు), అధికారులు శాంక్షన్ చేశారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్టుగా, బెజవాడ హాస్పిటల్ అధికారులు శాంక్షను అయిన ఈ హక్కులను అమలుజరపకుండా కూర్చున్నారు. తిరిగి ఆందోళన సాగించగా వారం రోజులనుంచి అమలుజరుపుతున్నారు.

## బొగ్గుకూలీల విజయం

బెజవాడ రైల్వే కార్మికులు తమ ఐక్యతా బలంద్వారా మరొక విజయాన్ని సాధించారు. ఇంజన్లలో బొగ్గునునింపే బొగ్గుకూలీలు బెజవాడ లోకోషెడ్డులో దాదాపు 96 మంది వున్నారు. వీరిలో ప్రమోషన్ అనేదిలేకుండా 6, 7 సంవత్సరాలనుంచి పనిచేస్తున్న దాదాపు 50 మంది వున్నారు. ఈపనిలో ప్రమోషన్ అవకాశాలు లేకపోవడమే కాకుండా, వీరు చేసేది వట్టి బండపని. బొగ్గుతట్టలను అదే పనిగా మోస్తుండాలి. బొగ్గు నలుసులు, నుసి, కళ్ళల్లో పడుతుంటాయి. కళ్ళు చెడిపోతుంటాయి. మరొక ఉద్యోగానికి అనర్హులయిపోతుంటారు.

ఈ అవస్థలన్నిటిని దృష్టిలోపెట్టుకొని, బొగ్గుకూలీలను అదేజీతంతోనుండే తేలికపాటి ఇతరపనుల్లోకి త్వరగా మారుస్తుండాలని, బ్రాంచి ఆందోళనచేసింది. బొగ్గుకూలీలు జాయింటుమహజర్లను పెట్టారు. మూడుసార్లు జిల్లా అధికారివద్దకు డెప్యుటేషనువెళ్ళి, తమ కోర్కెను తెలియచేశారు చాలా యేళ్ళనుంచి పనిచేస్తున్న 50 మంది బొగ్గుకూలీలను తేలికపాటి పనుల్లోకి మార్చారు. ఈ మార్పు ఫలితంగా వీరికి అంతకన్నా పెద్దపనిలోకి ప్రమోషన్ అవకాశాలుకూడా చేకూరాయి. ఈబొగ్గుకూలీల డెప్యుటేషన్లలో యితర తరగతుల పనివారుకూడా వుత్సాహంగా పాల్గొన్నారు.

## లైట్లిచ్చారు

బెజవాడ రైల్వేయార్డులో పనిచేస్తున్న కప్లింగుపోర్టర్లకు, పాయింట్సుమన్లకు రాత్రిళ్లు పనిచేయడానికి వీలుగా అధికారులు లైట్లను సప్లయిచేయుటలేదు. పనివారు లైట్లను అడుగుతుంటే అధికారులు యుద్ధ సమయమంటున్నారు. లైట్లు లేకపోవడం మూలంగా, కప్లింగుపోర్టరు వాగన్లమధ్య కప్లింగులు వేసేటప్పుడు, వారి వేళ్ళకు చేతులకు దెబ్బలు తగులుతున్నాయి. పాయింట్లు పడ్డాయనుకొని బండిని రమ్మంటారు. అది ఒక లైనుమీదకు రావలసింది మరొకలైనుమీదకు వస్తుంది. అటువంటప్పుడు పట్టాలు తొలగి పడవచ్చు. అంతకుముందు అదేలైనుమీద ఉన్న పెట్టెలను గుద్దుకోవచ్చు. దీని ఫలితంగా పెట్టెలను కొన్ని రోజులవరకు మరమ్మతులో నుంచవలసివస్తున్నది. ఈవిధంగా రైళ్ళ రాకపోకలు దెబ్బతింటున్నాయి. దీనిని గుర్తించి లైట్లసప్లయి కొరకు బెజవాడబ్రాంచి ఆందోళన సాగించింది. యూనియన్ సెంట్రల్ కౌన్సిలు అధికారులకు తెలిపింది. ఇప్పుడు లైట్లను సప్లయిచేస్తున్నారు.



# సిరియా, లిబనాన్ తగాదాకు కారకులెవరు?

లిబనాన్, సిరియాల్లో నానాటికి ముదిరిపోతు... పోరాటాలను అణచడానికంటూ చర్చిల్ బ్రిటిష్ సేనలను పంపాడు. "ఈ సంఘర్షణ డంబార్టన్ ఓక్సు నిర్ణయానికి, శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశ ఆశయాలకు విరుద్ధము. కాబట్టి దీనిని తక్షణమే అరికట్టి, శాంతి పద్ధతుల్లో అక్కడ తగాదా పరిష్కారమయేలా చూడాలి. ఇది చాల అవసరం" అని సోవియట్ ప్రభుత్వం ఫ్రెంచి, బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలకు సందేశం పంపింది. జనరల్ డిగాల్ ఫ్రెంచి సేనల నన్నిటిని బారకాసులలోకి మరలించి, అక్కడినుండి బయటకు వెళ్ళకూడదని కట్టుదిట్టాలు చేశాడు. సిరియా, లిబనాన్ - ఫ్రాన్సు సమస్య మాత్రమే కాదనీ, దీనిని అంతర్జాతీయ సమస్యగా పరిగణించాలని ప్రకటించాడు. ఫ్రాన్సు, బ్రిటన్ అమెరికా, సోవియట్, సిరియా, లిబనాన్, ఇతర అరబ్బు దేశాలన్నీ కలిసికూర్చొని దీనినిపరిష్కరించాలని కోరుచున్నాడుడిగాల్.

ఈ సమస్యయొక్క ప్రస్తుత స్థితి యిది.

యూరప్‌లో యుద్ధం ముగిసి నెలతిరిగిందో లేదో, అప్పుడే ఇంతకల్లోలంకలిగింది. కొద్దిగా చేయిజారితే ఫ్రెంచి, బ్రిటిష్ సేనలకే సంఘర్షణ వచ్చేది. ఇంత ఆందోళనకరమయిన సంఘర్షణలకు కారణం ఏమిటి?

లోగడ ఒకసారి లిబనాన్, సిరియాల విషయమై పెద్ద తగాదా వచ్చింది. ఆ రెండు దేశాల స్వాతంత్ర్యాన్ని ఫ్రాన్సు, బ్రిటనులు గుర్తించడంతో అప్పటికది పరిష్కారమయింది.

పేరుకి అలా స్వాతంత్ర్యాన్ని గుర్తించినా ఆ రెండు దేశాలపై పెత్తనం ఇంకా చలాయించాలనే అభివృద్ధి నిరోధకులు ఫ్రాన్సులో లేక పోలేదు. వీళ్ళ ప్రాబల్యం ఫలితంగా ఫ్రెంచి ప్రభుత్వం సిరియా, లిబనాన్లలో కొన్ని ప్రత్యేక హక్కులు కోరింది. విమాన, నౌకా కేంద్రాలుకావాలనీ, ప్రత్యేక ఆర్థికహక్కులు కావాలనీ, సిరియా, లిబనాన్ సేనలు ఫ్రెంచి సేనాధిపతుల అజమాయిషీక్రింద ఉండాలనీ ఫ్రాన్సు కోరినట్లు, ఆరెండు దేశాల ప్రతినిధులు శాన్‌ఫ్రాన్‌సిస్కో సమావేశానికి ఒక మెమోరాండమును సమర్పించారు. అదే సమయములో ఫ్రెంచి ప్రభుత్వం సిరియా, లిబనాన్‌లకు అదనం సేనల్ని పంపింది. "బెదరించి తన హక్కులు సంపాదించడానికే ఇది" అని ఆ దేశాల ప్రతినిధులు వ్యాఖ్యానించారు. తమ స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తామని లోగడ చేసిన వాగ్దానానికి ఈకోర్కెలు పూర్తిగా విరుద్ధమని గుర్తించి లిబనాన్, సిరియా ప్రభుత్వాలు వాటిని తృణీకరించాయి. ఇది సహజమే. పైగా, ఇలా అదనపు సేనల్ని దింపడం తమ స్వాతంత్ర్యానికి భంగకరమని ప్రకటించాయి. ఆపైని పోరాటాలు ప్రారంభమయాయి.

## కారకులు

పెద్ద వ్యాపారస్తుల తరఫువారు కొందరు ఫ్రెంచి ప్రభుత్వంలో పలుకుబడి కలిగి ఉన్నారు. వెనుకటి ఫ్రెంచి సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టుకోవాలని వీరు కలలు గంటున్నారు. ఈ సామ్రాజ్యవాదులే ఇప్పటి అల్లరులకుకారణం. నాజీలకు ఆర్థిక సహకారం చేసినందుకు వేయికిపైగా పెద్ద వ్యాపారులు అరెస్టయారు. మొన్న జనవరి మాసాంతము సరికి వీరిలో ఇద్దరిమీద మాత్రమే విచారణ జరిగింది. మిగతావారి మీద ఇంకా విచారణ జరక్కుండా ఉండడానికి పై సామ్రాజ్యవాదులే కారణం. ఫ్రాన్సు ఆర్థిక పునర్నిర్మాణం సాఫీగా సాగకుండా అరికడుతూంది కూడా వీరే. కార్మికుల జీతాలను పెరగనీయకుండా నొక్కిపట్టి వారిలో అసంతృప్తిని రెచ్చగొడుతున్నది ఈ దుష్టగ్రహాలే. అంతేకాదు. ఇటీవల ఆల్జీర్సు (ఉత్తరాఫ్రికా)లో తిండి కరువొచ్చింది. ఆకలిమంటలతో మాడిపోతున్న ప్రజలు ఆహారాన్ని కోరుతూ ప్రదర్శనాలు చేశారు. అప్పుడు స్థానిక పోలీసులు ఆ అభాగ్యులమీద తుపాకులు కాల్చి, ఎందరినో పొట్టబెట్టుకున్నారు. ఈ హత్యాకాండను ప్రేరేపించింది కూడా పై అభివృద్ధి నిరోధకులే.

లిబనాన్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు ఫార్జుల్లాఅల్‌హుల్వా, జనవరినెలలోనే వీరిని గురించి ఇలా రాశాడు: "ఫాసిస్టుతత్వం యింకా వదలని కొంతమంది ఫ్రెంచి రాజకీయవేత్తలను, వారి రాజకీయాలను లిబనాన్ ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రపంచం మారిపోతూందని, సామ్రాజ్యవాదపు రోజులు అంతరించిపోయాయనీ, తిరిగిరావనీ పాపం ఈ రాజకీయవేత్తలు గ్రహించరు."

## ఫ్రాన్సులో

ఫ్రాన్సులో యిలాంటి రకాన్నెదుర్కొనే అభివృద్ధికరశక్తులు యెడతెగని పోరాటం సాగిస్తున్నాయి. ఫ్రాన్సులో ఇటీవల జరిగిన మున్సిపల్ యెన్నికలలో కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలకు అఖండ విజయం చేకూరింది. ఈ పార్టీల కింత బలమున్నా, తాత్కాలిక ప్రభుత్వవర్గంలో మాత్రం వీరికి తగిన ప్రాతినిధ్యంలేదు. దీనినిబట్టే తెలుస్తూంది ఇప్పటి ఫ్రెంచిప్రభుత్వం ప్రజలకు పూర్తి ప్రాతినిధ్యం వహించడంలేదని. ఈ కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టుపార్టీలు ఫ్రాన్సులోని ఫాసిస్టు అనుకూలురనేకాదు ఎదుర్కొని పోరాడుతూంది. సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటిస్తూ, వలస దేశ ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్యం, సరిసమాన హోదా ఉండాలనికూడా ఆందోళన చేస్తున్నాయి.

ఆల్జీర్సులో ప్రజలను కాల్చారని విని ఫ్రెంచి కమ్యూనిస్టు దినపత్రిక 'లాహ్యూమనైట్' ఇలా రాసింది: "ఇదిఫాసిస్టు తత్వంతో ప్రజల్ని రెచ్చగొట్టడం తప్ప మరేమీకాదు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ఉద్యోగులపైని, ధనిక భూస్వాములపైని వెంటనే తీవ్రచర్య తీసుకోవాలి. కరువుప్రాంతాలకు వెంటనే కావలసినంత గోధుమ ఎగుమతి చేయాలి."

సిరియా, లిబనాన్ కమ్యూనిస్టులుకూడా ఈ విషయంలో తమ దృక్పథాన్ని స్పష్టం చేశారు. జనవరి 17 న డెమాస్కస్‌లో మాట్లాడుతూ సిరియా పార్టీనాయకుడు ఇలా అన్నాడు :

మా ప్రజలు ఫ్రెంచి ప్రజలతో సౌభ్రాతృత్వాన్నే కోరుతున్నారు. ఫ్రెంచి సామ్రాజ్యవాదాన్నెదుర్కొంటూ, మా స్వాతంత్ర్యం కోసం, బానిస ప్రజలందరి స్వాతంత్ర్యం కోసం పోరాడుతూన్న ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీకి చేదోడు వాదోడుగా ఉంటాము."

దీనినిబట్టి స్పష్టమవుతున్న దేమిటి? సిరియా, లిబనాన్ దేశాలప్రజలు తమస్వాతంత్ర్యం కోసం ఫ్రెంచి అభివృద్ధి నిరోధకులను ఎదుర్కొని సాగిస్తున్న పోరాటమే ఇది. ఈ పోరాటంలో ఫ్రెంచి అభివృద్ధికర శక్తులు సిరియా, లిబనాన్ ప్రజలకు అండగా నిల్చున్నాయి.

## బ్రిటన్ వంతు

ఈకథ ఇంతటితో పూర్తికాలేదు. ఈకల్లోలానికి బ్రిటిష్‌సామ్రాజ్యవాదులుకూడా కారణం. లోగడ హిట్లరు, ముసోలినీ, టోజోలు ఒకవైపు యూరప్ ప్రజల్ని ఇనుప పాదాలక్రింద అణగద్రొక్కుతూ, మరోవైపు భారత స్వాతంత్ర్యోద్యమానికి పట్టుగొమ్మలమని బాకాలూదారు. అలాగే ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఒకవైపు నెహ్రూ అజాద్ వంటి స్వాతంత్ర్యయోధుల్ని ఖైదుకొట్టుల్లో మ్రగ్గజేస్తూ, మరోవైపు లిబనాన్ దేశాల స్వాతంత్ర్య రక్షకులమని ఛాతీ చరుచుకుంటున్నారు. వీరి అసలు ఉద్దేశాలు స్పష్టమే. అరబ్బుదేశాలు బ్రిటిష్ వారికి కీలకస్థానాలు. ఇరాక్, ట్రాన్స్‌జోర్డానియా అనే రెండు అరబ్బురాజ్యాలూ బ్రిటిష్ వలస దేశాలకింద లెక్కే. ఈజిప్టులో బ్రిటిష్‌వారి పలుకుబడి సంగతి వేరే చెప్పనక్కరలేదు. సిరియా, లిబనాన్ దేశాల్లో ఫ్రెంచివారిధోరణి శృతిమించేసరికి మొట్టమొదట పోలికేక పెట్టింది, ఈదేశాలే. అది బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పెడబొబ్బ అని గుర్తించడం అంత కష్టమైన పనికాదు. మొదట్లో బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు తమ ఏజంట్లను నియోగించారు. ఇప్పుడు బాహాటంగానే తమ పన్నాగాలు సాగిస్తున్నారు. "సిరియాలో తరిఫీదు కంటూ ఉన్న బ్రిటిష్‌సేన ఈ సంఘర్షణలో జోక్యం కలిగించుకోడానికి సిద్ధంగా ఉంద"ని సిరియా నుంచి ఒక ప్రకటన జరిగింది. సిరియా, లిబనాన్లలో బ్రిటిష్‌వారు పెద్దఎత్తున మిలిటరీ సన్నాహాలు చేస్తున్నారనీ, ఇవన్నీ ఫ్రెంచివారితో సంప్రదించకుండానే చేస్తున్నారనీ ఫ్రెంచివారి ఆరోపన. అనేకమంది బ్రిటిష్ ఏజంట్లు ఈ ప్రాంతాల ప్రజలను ఫ్రాన్సుకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారనీ, సిరియా లిబనాన్లలో 6లక్షల బ్రిటిష్‌సైనికులున్నారనీ, సిరియా పోలీసులు బ్రిటిష్ ఆయుధాలతోనే ఫ్రెంచివారిపై కురికారనీ డిగాల్ ప్రకటించాడు. దీనినిబట్టి స్పష్టమవుతున్న దేమిటి? సిరియా, లిబనాన్ ప్రజల్లో పవిత్రమైన స్వాతంత్ర్యేచ్ఛ రగులుతూంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దీనిని వినియోగించుకొని అరబ్బు దేశాలపై తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోడానికి ఎత్తులువేస్తున్నారు. నిజానికి ఫాసిస్టులు ఉపయోగించిన పద్ధతి ఇదే. ఈ విధంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు జోక్యం కల్పించుకొని, పోరాటాన్ని మరింత రెచ్చగొట్టకుండా ఉంటే, ఇదింత దూరం రాకపోయేది. ఇటు ఫ్రెంచి ప్రజాస్వామ్యశక్తులు, అటు సిరియా, లిబనాన్ స్వాతంత్ర్యోద్యమాలు ఏకమై ఫ్రెంచి సామ్రాజ్యవాదులపై ఒత్తిడి తెచ్చి, వారి ఆటలు సాగకుండాచేయగలిగేవి. కాని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అలా జరగనీయకుండా చేశారు. సిరియా, లిబనాన్ దేశాలను ఫ్రెంచి అధీనంలోనుంచి తప్పించి తమ బుట్టలో వేసుకో ప్రయత్నించారు. సిరియా, లిబనాన్ల స్వాతంత్ర్య సాధనకు అంతరాయం కలిగించారు. ఇప్పుడు సహృదయు లందరూ కలిసి ఈ తగాదా పరిష్కరించే అవకాశం కలిగింది. దీనిని వినియోగించుకొని, సిరియా, లిబనాన్‌ప్రజలు బ్రిటిష్ పన్నాగాలను కూడా ఎదుర్కొగలిగితేనే వారికి స్వాతంత్ర్యం దక్కగలదు.

— (పీపుల్సువార్ నుండి)

(4 వ పేజీ తరువాయి)వారి రక్షణకు వెళ్ళారు. అక్కడున్న దుండగీడులకు బుద్ధిచెప్పి పారదోలారు.

తరువాత కంకిపాడు పోలీసు సబ్‌యిన్‌స్పెక్టరు తన సిబ్బందితో వచ్చాడు. కరణానికి వ్యతిరేకపక్షంలో ఉన్నవారిని అరెస్టుచేశారు. కరణం ముఠావాళ్ళు యిళ్ళకు వచ్చి బూతులు తిట్టడం, వ్యతిరేకపక్షంలో వున్న కుటుంబాల వాళ్ళను భయపెట్టడం చేస్తూంటే ఉపేక్షిస్తూ మద్దతునిచ్చాడు.

ప్రజల పక్షంనుండి యిచ్చిన రిపోర్టులపైని చర్య తీసుకోలేదు. అరెస్టు చేసినవారిని కంకిపాడులో ఉన్న యిరుకుకొట్టులో పెట్టి 24 గంటలకంటె ఎక్కువకాలం ఉంచాడు. సబ్‌యిన్‌స్పెక్టరు కరణం ముఠాతో కలసి దొంగకేసు బనాయించచూస్తున్నట్లు తెలుస్తున్నది. దీనిపై సూపరింటెండెంటుకు రిపోర్టు చేయబడింది.

(డిప్యూటీసూపరింటెండెంటు ఈవిషయమై విచారణచేసి కంకిపాడు సబ్‌ఇన్‌స్పెక్టరును ట్రాన్సుఫరు చేస్తారని కూడ తెలిసింది.)

## గాంధీ - జోషీ ఉత్తర ప్రత్యుత్తరాలు

★

గాంధీజీ జోషీగారిని కొన్ని ప్రశ్నలువేస్తే సమాధానం చెప్పలేక పారిపోయాడని, ఆంధ్ర కాంగ్రెసు నాయకులు, వారి అనుచరులు దుష్ప్రచారం చేస్తున్నారు. మన రాష్ట్రంలో పిచ్చెక్కినట్లు పచ్చి బూతులు వాగుతున్నారు. ఈ బూతుల ధోరణిలోనే కాశేశ్వరరావుగారు గాంధీజీకి ఉత్తరం వ్రాశాడు. ఉత్తరంలో వ్రాసిందంతా తప్పుల తడక, నీలాపనిందలు. కాశేశ్వరరావు వ్రాసిన వుత్తరం చదివితే యీయనకు మతిపోయిందా అని సందేహం కల్గుతుంది.

గాంధీజీ, జోషీలకు జరిగిన పూర్తి ఉత్తర ప్రత్యుత్తరాలు అచ్చువేస్తున్నాం. కొద్దికాలంలో పుస్తకం వస్తోంది. ముందుగానే మీ ఆర్డరు పంపండి. లేకపోతే ఆశాభంగం తప్పదు.

ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ.

# కరణం రామారావు పితలాటకం

రావులపాడు గ్రామంలో ఒక చెట్టు క్రింద క్లీనుకున్నాడు. ఇతనిపేరు కరణం రామారావు. గ్రామంలో తగువులు పెట్టడం, రైతులను కోర్టులకుతిప్పడం, లంచాలుపుచ్చు కోడం వీనివృత్తి. తప్పుడు సాక్ష్యాలకు పెట్టి నదిపేరు. అనేక కేసులలో కోర్టువారు వీరిపై తీవ్రమైన రిమార్కులు ప్యాసుచేశారు.

ఇదే గ్రామంలో వడ్డీవ్యాపారస్తుడున్నాడు. కార్తీకమాసంలోనీవలకునాములిచ్చి, రెట్టింపు గుంజుతుంటాడు. ఈయనకూడ కోర్టుపక్షి. పేరు బెల్లపు సోమయ్య. కరణం రామారావు, బెల్లపుసోమయ్య కలసి రైతులను పీడించుకు తింటారు.

ఈగ్రామంలో రైతుసంఘం ఏర్పడినప్పటి నుంచి యీప్రజా విరోధులనుంచి రైతులను కాపాడటానికి ప్రయత్నించుతూంది. రైతులు సహకార పద్ధతిలో అప్పులు తెచ్చుకొని నాములు లేకుండా చేసుకున్నారు. తగవులు గ్రామంలోనే పరిష్కారం చేసికొంటూ, ఐక మత్యంగా వుంటున్నారు. ఇదంతా కామ్రేడ్ ధూళిపూడి రాఘవయ్యగారి నాయకత్వాన జరుగుతూంది. ప్రజలను పీడించే రాబందుల నోట్లో గడ్డపడింది. వారికి లంచాలుదొరకడం లేదు. పెత్తనం పోయింది. ప్రజలు అస హ్యించు కొంటున్నారు.

గ్రామ రైతునాయకుడైన ధూళిపూడి రాఘవయ్యగారు జబ్బుచేసి మే 26 వ తేదీ నుంచి పదమబలంకలో చికిత్స పొందు తున్నారు. వీరు లేనిసమయంచూసి పైముఠా గ్రామంలో ఏదో తగవుతెచ్చి, చీలికలుతేవా లని కుట్రపన్నాడు.

30 వ తేదీన ధూళిపూడి బుల్లియ్య, అంజయ్య అను కామ్రేడ్స్, మరిద్దరూ దోస పాడురైలుస్టేషనునుండి రైలుదిగివస్తున్నారు. కరణం రామారావుముఠా దోసపాడు రౌడీ లైన గుమ్మడి అమ్మేశ్వరరావు, నెక్కలపూడి మల్లయ్య వగైరాను తగవుకు పంపింది. వాళ్లు ఆకస్మికంగా కామ్రేడ్స్‌పైబడి కొట్టారు.

31 వ తేదీన బెల్లపు సుబ్బయ్యగారు అను రైతు తమ యింటిముంగల కూర్చున్నారు. అటువస్తున్న కరణంరామారావు, సుబ్బారావు, గోపాలస్వామిగార్లను గతరోజు తగవును గురించి ప్రశ్నించారు. బుల్లియ్య, అంజియ్య గార్లను ఎందుకు కొట్టించారని అడిగారు. దానితో కరణం ముఠా మండిపడి బూతులు తిట్టసాగింది. 'వారినేకాదు, ఇప్పుడు నిన్ను కొడితేదిక్కెవరు?' అంటూ బెల్లపుసుబ్బయ్య గారిపై బడ్డారు. ఇంతలో రైతులు, కామ్రేడ్స్ పోగయ్యారు. కరణం రామారావు ముఠాకు బుద్ధిచెప్పారు.

కరణం రామారావు తప్పుడు రిపోర్టు యిచ్చాడు. కొంపలు తగుల బెడుతున్నారనీ, కొందరు ప్రమాదావస్థలో వున్నారనీ, అభూత కల్పనలు రిపోర్టులో వున్నాయి. దీనిపై 3 వ తేదీన పోలీసులువచ్చారు. రైతులను 24 మం దిని, కరణంముఠా ఆరుగురిని అరెస్టుచేశారు. కాని కరణాన్ని వదలివేశారు. మొత్తం అందరినీ గుడివాడ సబ్‌జైలులో వుంచారు.

— మా విలేఖరి

# గ్రంధాలయాలు - ప్రభుత్వ విరాళాలు

ఆంధ్రదేశ గ్రంధాలయ సంఘ కార్య దర్శి శ్రీ పాతూరి నాగభూషణం గారిట్లు వ్రాయుచున్నారు :

1945 - 46 వ సం॥నకు మదరాసు ప్రభు త్వమువారు రాష్ట్రములోని పంచాయతీబోర్డుల గ్రంధాలయములకు రు 45,000 లు, తదితర గ్రంధాలయములకు రు 30,000 లు. విరాళ ముగ నిచ్చుటకు నిశ్చయించినట్లు తెలియు చున్నది. వీని నిమిత్తం గ్రంధాలయముల వారు జులై నెల మొదటివారంలో దరఖాస్తుల పంపవలసియుండును. అందుచే క్రింది విష యములను ప్రైవేటుకమిటీల యాజమాన్యాన నడుచుచున్న గ్రంధాలయములవారు గమ నించ గోరెదను.

1. ఈ గ్రాంటులకై దరఖాస్తు చేయుటకు గ్రంధాలయముల 1860 వ సం॥ 21 వ ఆక్టు (సొసైటీల రిజిస్ట్రేషన్ ఆక్టు) క్రింద రిజిష్టరై యుండవలెను.

2. గ్రాంటు (విరాళము) నిమిత్తము దర ఖాస్తు పెట్టుకొనులోపల కనీస మొకపర్యాయ మైనా స్కూళ్ళయినస్పెక్టరులచే ప్రతిగ్రంధా లయము తనిఖీ చేయబడి వీని పని సంతృప్తి కరముగ నున్నట్లు రిపోర్టు చేయబడవలెను.

3. పై గ్రాంటుల నిమిత్తం దరఖాస్తులు పెట్టగోరుచు ప్రభుత్వమువారు ప్రకటించు జీ. ఓ. నిమిత్త మెదురుచూడవలెను. ఇది పోగడ సంవత్సరము విరాళముల పొందిన గ్రంధాలయములకు జూన్ నెలలో పంప బడును. తక్కిన గ్రంధాలయములవారు ఈ జీ. ఓ. ను జిల్లా విద్యాశాఖాధికారులకు వ్రాసి తెప్పించుకొనవలెను.

కోఆపరేటివ్ సొసైటీలు, పంచాయితీ బోర్డులు, జిల్లాబోర్డులు, మున్సిపాలిటీలు, నడుపు గ్రంధాలయములు రిజిష్టరు కానక్కర లేదు. కాని విద్యాశాఖకుచెందిన ఇన్‌స్పెక్టర్లు వీనినికూడ తనిఖీచేసి వీని పని క్రమముగ నున్నట్లు రిపోర్టు జేయవలెను. కాన ఆంధ్ర దేశములో అవకాశమున్న అన్ని గ్రంధా లయములు వెంటనే పై అర్హతలు సంపా దించుకొని, సకాలమున తమతమ దరఖాస్తుల బంపి అధికముగ విరాళముల బడయు ప్రయ త్నములోనుండ మనవి. దీనికి సంబంధించిన విశేష వివరములు కావలసినవారు కార్యదర్శి, ఆంధ్రదేశ గ్రంధాలయ సంఘము, పటమట లంక (వయా) బెజవాడ: చిరునామాకు వ్రాసిన బడయగలరు.

(5 వ పేజీ తరువాయి) ఐక్యతతో ప్రజల ఆహార సమస్యను, అంటుజాడ్యాల సమ స్యను, పరిష్కరించడానికి ముందడుగువేయ వలసియుంది. దీనితోబాటు, మన దేశంలో కూడా నిరంకుశాధికారుల చర్యల్ని ఖండిం చుతూ ఆందోళన లేవదీయవలసియుంది. బ్రిటిష్‌ప్రజలు బర్మాపట్ల ప్రభుత్వం అవలం బించే పాడువిధానం యుద్ధనిర్వహణకు ఎంత హాని కలుగజేస్తుందో గుర్తించి, తమ ప్రభు త్వంమీద బలమైన ఒత్తిడి తీసుకురావాలి.

ఇలా జరక్కపోతే, బర్మా కరవుకాటకా లకు నిలయమై, జపాన్ సేనలపై జరుగు తూన్న యెదురుదాడి విఫలం కాకమానదు.

(3 వ పేజీ తరువాయి)రాజగోపాలాచారి ఉప న్యాసాన్ని మెచ్చుకొంది. పాతపోరబాట్లను పట్టుకు వేలాడుతూ కీచులాడటం రాజకీయపార్టీ లకు సబబు కాదన్నది "ప్రస్తుతం ప్రజల అవసరాలనుదృష్టిలో వుంచుకొని, యీబురద నుండి బయటపడటానికి కృషిచేయాల"ని సలహాయిచ్చింది.

## డాక్టర్ సయ్యద్ మహమ్మద్

జూన్ 1 వ తేదీ గోఖలేహాలు సభలో మాట్లాడుతూ, మాజీ వర్కింగ్‌కమిటీసభ్యుడు మహమ్మద్ "భారతదేశమంతటా మంత్రిపద వులు స్వీకరించాల"ని చెప్పారు. రాజగోపాలా చారి వాదనను బలపరిచారు

ఇలా కొందరు దేశభక్తులు పరిస్థితులను, గమనిస్తున్నారు. ప్రతిష్టంభన తొలగించాలని కోరుతున్నారు. అందుకు మంత్రివర్గస్వీకారం అవసరమని గుర్తించారు.

కాని కాంగ్రెసు అసెంబ్లీ పెత్తందార్లు, యివేమీ పనికిరావని పైకి బీరాలు పలుకు తున్నారు. లోలోన మంత్రిపదవులు తమకు కావాలంటే, తమకు కావాలని కీచులాడు తున్నారు. ముఖ్యంగా ఆంధ్రకాంగ్రెసు నాయ కులు కాశేశ్వరరావు, చంద్రమౌళి, రంగాగార్లు నిర్మాణ కార్యక్రమం పేరుతో కమ్యూనిస్టు లను విందించడంతప్ప ప్రజల మేలుకొరకు చేస్తున్నపని శూన్యం. పైగా వీరు మంత్రి పదవులలో ప్రవేశించాక కమ్యూనిస్టులపని పడతామని బెదిరించుతున్నారు. ఒకవైపున తీర్మానాలలో తాము పదవీ స్వీకరణకు వ్యతి రేకమని చెప్పుకొంటున్నారు. రెండోవైపున రాజగోపాలాచారి వంటివారిని రాకుండాచేసి తామే మంత్రిపదవులను ఆక్రమించాలని మంత నాలు చేస్తున్నారు.

బయటికొకటి, లోనఒకటి ప్రయత్నాలు చేస్తున్న కాశేశ్వరరావు వంటివారి మోసం ఎంతోకాలం సాగదు. వారి పద్ధతి రాజకీయ మర్యాదకే భిన్నమైనది. కొలది రోజుల్లోనే వీరి రహస్యాలు బయటపడుతాయి. ప్రజ లంతా వీరి మోసాన్ని గ్రహించుతారు.

## వేవెల్ తిరుగరాక

భారతరాజకీయ సమస్యలను చర్చించ డానికి ఇంగ్లండు వెళ్ళిన వేవెల్ తిరిగి భారత దేశానికి బయలుదేరాడు. ఇంగ్లండులో ఎన్ని కలహడావుడి ప్రారంభమయింది. లేబర్‌పార్టీ భారతప్రతిష్టంభన తొలగించుతామని తనఎన్ని కల ఘోషణాపత్రంలో చేర్చింది. ఇది కన్స ర్వేటివ్ పార్టీకి కూడ వెన్నపుట్టించింది. అంత వరదాకా 'నసేమి కదలను' అని మొండికేసిన చర్చిల్ దిగిరావలసివచ్చింది. లండను టైమ్స్ లాంటికన్సర్వేటివ్ పత్రికలుకూడ, 'భారత దేశం విషయమై ఏదో ఒకటి చేయాలి, ఇది చర్చిల్ మంత్రివర్గానికి పరీక్ష' అని ఒత్తిడి చేశాయి.

వార్తలనుబట్టి చూస్తే, గత్యంతరం లేక చర్చిల్ దిగివచ్చాడని తెలుస్తూంది. రాజప్రతి నిధి వేవెల్‌ను క్రొత్త ప్రతిపాదనలతో పంపు తున్నాడు. వేవెల్ ఇండియాకురాగానే ఇంగ్లం డులోనూ, ఇవటకూడ ఒకేసారి ప్రకటన జరుగుతుందనీ, రాజకీయఖైదీలు విడుదల చేయబడతారని వార్తలు చెబుతున్నాయి.

సామ్రాజ్యవాది చర్చిల్ తనప్రజలముందు తాను భారత సమస్యా పరిష్కారానికి వ్యతి రేకం కాదని తెలుపుకోడానికి ఎన్నికల ఎత్తు వేస్తున్నాడు. ఈ సమయంలో భారత రాజకీయ నాయకులు కలసి జాతీయవాంఛను ఏకోన్ము ఖంగా తెలపవలసివుంది. లేనిచో క్రిప్స్‌రాయ బారాలలో వలెనే దగా జరుగుతుంది. కాబట్టి లీగ్, కాంగ్రెసు, నిమ్నజాతుల నాయకులు కలసి భారత స్వాతంత్ర్యాన్ని సామ్రాజ్యవా దులచేతులనుండి గుంజుకోవాలి. అందుకు వెంటనే రాష్ట్రాలలోను కేంద్రంలోనుసంయుక్త మంత్రివర్గాలను ఏర్పరచాలి. 4—6—45

— మద్దుకూరి చంద్రశేఖరరావు

# విద్యాభివృద్ధికి తోడ్పడండి

కృష్ణాజిల్లా విద్యార్థిసంఘ ప్రధాన కార్య దర్శి వీరమాచనేని మధుసూదనరావుగారిలా ప్రకటిస్తున్నారు.

"కృష్ణాజిల్లాలోని బోర్డు హైస్కూళ్ళలో క్రితంసంవత్సరం క్రొత్తగా చేరటానికివచ్చిన విద్యార్థుల నుండి బెంచీలకొరకని, ప్రత్యేక పాకలకొరకని, ఒక్కొక్క విద్యార్థి దగ్గర రు. 5 మొదలు 25 రూపాయల వరకు వసూలు చేశారు. ముఖ్యంగా గుడివాడ, తాడంకి, పునాదిపాడు, పామర్రు హైస్కూ ళ్ళలోని హెడ్‌మాష్టర్లు ఎక్కువ మొత్తాలను వసూలు చేశారు. ఈవిధంగా మామూలు స్కూలు జీతములతో సంబంధంలేని ఈప్ర త్యేక రుసుము చెల్లించితేనే స్కూలులో జేర్చు కుంటామని భయపెట్టటంకూడా జరిగింది. ఈ రుసుము చెల్లించినవారినే ముందుగా జేర్చు కున్నారు. పునాదిపాడు హైస్కూలులో 5 వ ఫారము నందు త్తీర్ణులై 6 వ ఫారము చదువ బోవుచున్న విద్యార్థులందరివద్ద హెడ్‌మాష్టరు గారు 5 రూ. మొదలు రు. 25 ల వరకు వసూలు చేశారు.

"జీవితవ్యయం విపరీతంగా పెరిగిపోయిన యీ రోజులలో స్కూలు జీతములు కట్టి చదువు సాగించుటే కష్టంగా వుంది. ఇట్టి స్థితిలో విద్యార్థులను అదనపు రుసుము చెల్లించమనటం మూలిగేనక్కపై తాటికాయ బడినట్లుంది. విద్యార్థుల తలిదండ్రులు భరించ లేని సుంకం యిది. హైస్కూలు విద్యనేర్చు కొనుటకు ఉత్సాహము చూపుతూ ముందుకు వస్తున్న విద్యార్థులందరిని ప్రోత్సహించటం, విద్యాభివృద్ధికి తోడ్పడటం జిల్లాబోర్డు కర్త వ్యం. పాకలు మొదలైనవాటికి ప్రత్యేకంగా జిల్లాబోర్డు డబ్బును ఉపయోగించాలి. విద్యా ర్థుల దగ్గరనుండి హెడ్‌మాష్టర్లు బలవంత పెట్టి వసూలు చేస్తూంటే ఊరుకోవటం విద్యాభి వృద్ధికి తోడ్పడటం కానేరదు. ఈప్రత్యేక రుసుము వసూలుచేసే పద్ధతిని కొన్నిచోట్ల జిల్లాబోర్డు సభ్యులే ప్రారంభించారు.

"ఈసంవత్సరం గూడ స్కూళ్లు తెరిచేట ప్పటికి ఇలాంటి పరిస్థితులే కలుగవచ్చును, కనుక ఇప్పటినుంచి తగిన శ్రద్ధతీసుకుని, విద్యార్థులు యిలాంటి ఇబ్బందులకు గురి గాకుండాను, ఈమిషమీద ఏవిద్యార్థిని చేర్చు కోకపోవటం జరగకుండాను చూడవలసిందిగా జిల్లాబోర్డును, విద్యాధికారుల్ని కోరు చున్నాను."



# ఆంధ్రదేశానికి పరిశ్రమలు కావాలి

(12 వ పేజీ తరువాయి) నెల్లిమర్ల, బ్రిటిషు పెట్టుబడిదార్ల చేతుల్లో వున్నాయి.

## బిర్లాకంపెనీ ఎత్తు

ముందు యీపోటీ యింకా ఎక్కువ వస్తుంది. ఉదాహరణకు బిర్లాకంపెనీ దుంప నెయ్యి ఫ్యాక్టరీ నిర్మించడానికి అనుమతికోరి నట్లు తెలుస్తూంది. కృష్ణాకెనాల్‌వద్ద (బెజ వాడ సమీపంలో) యిందుకు భూమికూడా కొన్నారు. అదేవిధంగా బిర్లాబ్రదర్స్ రాయల సీమలో బట్టలమిల్లులు నిర్మించడానికి ప్రభు త్వాన్ని అనుమతి కోరారని రూఢిగా తెలు స్తోంది.

ఇవన్నీ ఆంధ్రప్రజలను ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యలు. కాని ఆంధ్రకాంగ్రెసు పెద్దలైన కాశేశ్వరరావు, చంద్రమౌళి వగైరా కండ్లుమూసుకుని మాకు యంత్రపరిశ్రమలు వద్దంటున్నారు. ప్రజలతో సంబంధంలేని పరమ ఛాందసులుమాత్రమే ఇలా అనగలరు. ఇలా ప్రచారం చేయటం ఆంధ్రాభ్యుదయానికి ఆటంకాలు చెప్పడమే. ప్రజా శ్రేయస్సుకే విరుద్ధంగా పనిచేయడమే.

## కర్తవ్యం

ఐతే కాంగ్రెసునాయకు లందరూ యిలా చెప్పడంలేదు. కొందరు కాంగ్రెసునాయకులు సిమెంటు ఫ్యాక్టరీలు, అభ్రకం గనులు, కెమి కల్ వర్క్స్ లాంటి పరిశ్రమలను ప్రోత్స హించుతున్నారు. షేర్లువేసి భాగస్వాము లుగా వున్నారు. కొందరు డైరెక్టర్లుగా కూడ వున్నారు.

కాని విచిత్రమేమంటే వీరంతా మౌనం వహించారు. రంగా - కాశేశ్వరరావు లాంటి వారు యంత్ర పరిశ్రమలేవద్దని చెబుతూ, ప్రజాశ్రేయస్సుకే విరుద్ధంగా ప్రచారం చేస్తు న్నారు. పరిశ్రమలను ప్రోత్సహించే కాం గ్రెసు నాయకులు ఈ ప్రచారాన్ని అరికట్టడం అవసరం. కర్తవ్యం కూడ.

ఐతే కమ్యూనిస్టులు పెట్టుబడిదారీ విధా నాన్ని బలపరుస్తారా? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. జమీందారీ ఆర్థికవిధానంలో వున్న ఆంధ్రదేశానికి పారిశ్రామికాభివృద్ధి అవసరం. ఈఅభివృద్ధి కలిగిననాడే జమీం దారీయుగపు సంకెళ్ళు పూర్తిగా నాశనమవు తాయి. అందుచే యంత్రపరిశ్రమల నిర్మా ణాన్ని బలపరుస్తాము.

ఈ పరిశ్రమలు పెట్టుబడిదారుల పెత్త నంలో వుండాలా లేక, సమాజమంతటి అధీ నంలో వుండాలా అనే విషయంవేరు. కరాచీ కాంగ్రెసు మహాసభ కూడ ప్రధాన పరిశ్రమ లన్నీ (Key Industries) జాతీయ ప్రభు త్వపరమొనర్చాలని తీర్మానించింది. నేషనల్ ప్లానింగ్ కమిటీ కూడ జాతీయ ప్రభుత్వం కంట్రోలు కిందనే పెద్దపరిశ్రమ లన్నిటినీ నిర్మించాలని సూచించింది.

కమ్యూనిస్టులం యంత్ర పరిశ్రమలను జాతిపర మొనర్చి, ప్రజలందరి వినియోగం కోసం ఉత్పత్తి జరగాలంటాము. కాని యీలోగా కూడ పరిశ్రమల నిర్మాణాన్ని ఎదిరించము; ప్రోత్సహించుతాము. పరిశ్ర మలలో పనిచేసే కార్మికుల హక్కులను రక్షించడానికి పూనుకుంటాము.

ఆంధ్ర ప్రజలు ఒక సంగతి గ్రహించాలి. రంగా - కాశేశ్వరరావుగార్లు చేస్తున్న యంత్ర పరిశ్రమలు వద్దనే ప్రచారం ఆంధ్రదేశాభ్యు దయానికే విరుద్ధం. అందుచే ఆంధ్రజాతి శ్రేయస్సునుకోరే ప్రజాసేవకులందరూ వారి వితండవాదనను ఎదిరించాలి.

## తప్పుడురాళ్ళకు దండన

ఎల్లాయపాలెం మజరా రామాపురంలో కొడవటి వెంకటసుబ్బయ్య, చిన్న వెంకట రత్నం అనే వర్తకులిద్దరు సీలులేని రాళ్ళతో వస్తువులుతూచి, ప్రజల్ని దగాచేస్తున్నారు. గ్రామ రైతుసంఘం యీ విషయం కమర్షి యల్‌టాక్స్ ఆఫీసరుతో రిపోర్టు చేయగా, వారువచ్చి, రాళ్ళు పట్టుకున్నారు. కోవూరు సబ్‌మేజస్ట్రేటు కోర్టులో ఒక్కొక్కనికి 50 రూపాయలు జుల్మానా విధించబడింది.

# ప్రధమ ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ మహాసభ, రాజమండ్రి

జూన్ 9, 10 తేదీలలో

స్థలం: శ్రీ గజలక్ష్మి సినిమా ప్రక్క "డాంగే నగర్" లో

సభాధ్యక్షులు: కామ్రేడ్ సి. వి. కె. రావు,
(ఆంధ్రరాష్ట్ర కార్మిక నాయకులు)

జెండా ప్రతిష్ఠాపకులు: కామ్రేడ్ చలసాని వాసుదేవరావు,
(ఆంధ్రరాష్ట్ర రైతు నాయకులు)

ప్రారంభకులు: కామ్రేడ్ ఎస్. ఎస్. మిరాజ్‌కర్,
(భారత కార్మిక నాయకులు)

# పార్టీఫండు వసూళ్లు

క్రిందటి సంచికలో ప్రకటించిన మొత్తం 35,238 15 9

## గుంటూరు జిల్లా

### గుంటూరు టౌను

| శ్రీయుతులు | | |
|---|---|---|
| ఆర్. ఓంకార్‌సింగ్ (కుమారుని జన్మదినోత్సవంలో) | 25 | 0 0 |
| గుంటూరు తాపీపనివారలు | 17 | 8 0 |
| ,, తిన్నలూరి కృష్ణయ్యముఠా | 17 | 8 0 |

### తెనాలి తాలూకా

| | | |
|---|---|---|
| తంజావూరు జైలు కామ్రేడ్స్ (రావి సత్యనారాయణగారిద్వారా) | 9 | 0 0 |
| **దావులూరు** | | |
| శశిరేఖమ్మ | 100 | 0 0 |
| గొట్టుముక్కల ఘంటయ్య | 98 | 0 0 |
| సీమకుర్తి పేరయ్య | 36 | 0 0 |
| మాదినేని అంకినీడు | 34 | 0 0 |
| గుమ్మడి దానియేలు | 30 | 0 0 |
| చింతల రామలింగస్వామి | 30 | 0 0 |
| కడియాల వీరయ్య | 25 | 0 0 |
| పొట్టి సుందరరామయ్య | 25 | 0 0 |
| యీదా వెంకటరెడ్డి | 20 | 0 0 |
| ఆలపాటి సాంబయ్య | 20 | 0 0 |
| మారుటూరు ఎల్లమంద | 10 | 0 0 |
| గట్టిపాటి సాంబశివరావు | 25 | 0 0 |
| **(అమృతలూరు)** | | |
| కతెవరం బుర్రకథ | 16 | 0 0 |
| దాసరి గరటయ్య (తెనాలి) | 25 | 0 0 |
| చుక్కపల్లి పెద్దన్న | 50 | 0 0 |
| **(కంచర్లపాలెం)** | | |
| కంచర్లపాలెం | 5 | 0 0 |
| కొల్లూరు | 8 | 0 0 |
| ఎస్. యన్. రాయి, (తెనాలి) | 100 | 0 0 |
| తెనాలి టౌన్ చిల్లరవసూళ్ళు | 5 | 0 0 |

### గుంటూరు తాలూకా

| | | |
|---|---|---|
| ముప్పాళ్ల ఘంటయ్య(పొన్నెకల్లు) | 100 | 0 0 |
| తాడిపనేని రాఘవయ్య (తుళ్లూరు) | 116 | 0 0 |
| కారుమంచి వెంకటేశ్వరరావు (కృష్ణాయిపాలెం) | 2000 | 0 0 |

## కృష్ణా జిల్లా

### గుడివాడ తాలూకా

| శ్రీయుతులు | | |
|---|---|---|
| చిలుకూరు వెంకటనారాయణ (పెదపాలపర్రు) | 20 | 0 0 |
| కామినేని శ్రీకృష్ణ, పెదమద్దాలి | 25 | 0 0 |
| మిక్కిలినేని శ్రీరాములు ,, | 25 | 0 0 |
| కానూరి బలరామకృష్ణయ్య (కవుతరం) | 50 | 0 0 |
| వడ్లమూడి వెంకటాద్రియ్య | 25 | 0 0 |
| జాస్తి వీరరాఘవయ్య (గుడివాడ) | 30 | 0 0 |
| ఆట్లూరి స్వామి (చౌటపల్లి) | 50 | 0 0 |
| గుత్తా నర్సయ్య (ముదినేపల్లి) | 5 | 0 0 |
| గుళ్ళపల్లి చక్రపాణి (కవుతరం) | 10 | 0 0 |
| వల్లభనేని రామస్వామి (కోడూరు) | 15 | 0 0 |
| ఉప్పలపాటి గోపాలం (పెదపాలపర్రు) | 30 | 0 0 |
| వల్లభనేనిగంగాధరరావు(గుడ్లవల్లేరు) | 25 | 0 0 |

## నెల్లూరు జిల్లా

### నెల్లూరు

| శ్రీయుతులు | | |
|---|---|---|
| బి. రామస్వామి అయ్యర్ | 25 | 0 0 |
| యం. వి. సుబ్బారావు | 10 | 0 0 |
| కుమార్ ద్వారా | 20 | 0 0 |
| నెల్లూరులో చిల్లరవసూళ్లు | 142 | 0 0 |
| వై. రామచంద్రారెడ్డి | 25 | 3 0 |
| **ఆత్మకూరు తాలూకా** | | |
| జి. వి. కొండయ్య ద్వారా | 90 | 0 0 |
| **కోవూరు తాలూకా** | | |
| విడవలూరులో, చె. వెంకయ్యద్వారా | 31 | 12 0 |
| తలమంచి | 39 | 0 0 |
| ఇందుపూరు | 40 | 8 0 |
| మోడేగుంట | 26 | 0 0 |
| పి. రమణయ్య | 10 | 0 0 |
| పూటుకూరు | 8 | 0 0 |
| లేగుంటపాడు | 5 | 0 0 |
| ఈశ్వరరెడ్డి | 10 | 0 0 |
| మొత్తం రు. | 38,973 | 6 9 |

(2 వ పేజీ తరువాయి, ఇట్టి మహనీయుల మన మందరం స్మరించి వారి పట్టుదలను ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవలసి వుంటుంది శ్రీ పంతులుగారు అనేక మూఢాచారాలు నిర్మూలమయ్యేటట్టు చేశారు. ఆంధ్ర యువకు లకు సంకెళ్లు వదలించారు. వారు ఆంధ్రదేశానికి అమూల్యమైన సేవచేశారు. ఆంధ్ర సాహిత్యవీధిలో నన్నయ మొదటి గోపురం నిర్మించాడు. తదాదిగా తక్కిన కవులు గోపురాలు నిర్మించుకుంటూవచ్చారు. ఆధునికయుగంలో మొదటిగోపురాన్నినూత్న పద్ధతిలో నిర్మించింది శ్రీ వీరేశలింగంగారే."

## శ్రీ ఆచార్య కురుగంటి

తర్వాత శ్రీ ఆచార్య కురుగంటి సీతా రామయ్యగారు ఉపన్యసిస్తూ సాహిత్య వీధుల్లో శ్రీ వీరేశలింగంగారు అనేక నూత్నపోకడలు పోయారనీ, అందులో ముఖ్యంగా కవిజీవితా లకు ఆంధ్రదేశం ఋణపడి వుందనీ, ఏ తెలుగు కవిని గురించి తెలుసుకోవాలన్నా వారికవిజీవితాలేదిక్కనీ, స్వీయచరిత్రనురచించి అట్టివాటికి మార్గదర్శకు లయ్యారనీతెల్పారు.

ఇంకా రాజమండ్రి, మండపేట, రామ చంద్రపురం, ప్రొద్దుటూరు, కొణకంచి, హరిపురం, చేబ్రోలు, బాపట్ల, వెల్లటూరు, వేటపాలెం, కొత్తపట్నం, పూటుకూరు, ఉప్పుగుండూరు, కోవూరు, ఇందుపూరు,పల్లె కోనలలో వీరేశలింగం వర్ధంతి జయప్రదంగా జరిగింది. ఆంధ్రదేశమంతా ఈ విధంగా యుగపురుషుడైన వీరేశలింగంగారినిస్మరించు కొని ధన్యమయింది.

## చదవండి

అమెరికాలో నీగ్రోలను, ఆఫ్రీకాలో మన సోదరులను నీచంగాచూస్తారని మనం విచా రిస్తున్నాం నల్లజాతులను నీచంగాచూడటాన్ని గర్హించుతున్నాం. కాని మనదేశంలో నిమ్న జాతులను అతి నీచంగా చూస్తున్నారు. అంట రానివారుగా పెట్టారు. దారుణమైన దారిద్ర్యం అనుభవిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 6 కోట్లకు పైగానున్న నిమ్నజాతులను స్వాతంత్ర్య పోరాటంలోకి తీసుకురావాలంటే మనం ఏమిచేయాలి? చదవండి:

**"స్వాతంత్ర్య పోరాటంలో ఆరు కోట్ల నిమ్నజాతుల స్థానం"**

# దేశాభ్యుదయానికి పరిశ్రమలు కావాలి

## వద్దనడం ఆంధ్రప్రజా శ్రేయస్సుకే విరుద్ధం

మద్దుకూరి చంద్రశేఖరరావు

యూరోపు యుద్ధం అంతమయింది. ఆరేండ్లుగ జరుగుతున్న ప్రపంచ సంగ్రామ అంతిమదశ ప్రారంభమయింది. ప్రపంచ ప్రజలు హిట్లరు ముసోలినీల పీచమడచారు. జపాన్ దురాక్రమణదారులకు బుద్ధిచెప్ప బోతున్నారు.

ఫాసిస్టులను ఓడించడంలో ప్రజారాజ్యమైన సోవియట్ ప్రధానపాత్ర వహించింది. సేనలకు ఆయుధాలను సప్లయిచేయడంలోను. పరిశ్రమలను ప్రమాదాలనుంచి తప్పించి పెంపొందించడంలోనూ. సోవియట్ ఆర్థిక విధానంయొక్క శక్తి రుజువయింది.

సోవియట్ ఉదాహరణ అన్నిదేశాలలోని మేధావులను ఆకర్షించింది. అన్ని దేశాలలోను నేడు ప్రజానాయకులు తమ దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధిచెందితేనే తమ ప్రజాభ్యుదయం చేకూరుతుందని గ్రహించారు. అందుచే ప్రతిదేశంలోను పారిశ్రామికాభివృద్ధికి విజ్ఞానవేత్తలు. సైంటిస్టులు. ప్లానులు వేస్తున్నారు. స్కీములు తయారుచేస్తున్నారు. తమ జాతీయాభ్యుదయానికి యంత్ర పరిశ్రమలు. విద్యుచ్ఛక్తియొక్క అవసరాన్ని గుర్తించి అందుకై కృషిచేస్తున్నారు.

అంతేగాదు. సామాన్యప్రజలుకూడ, "మన దేశంలో విమానాలు, మోటార్లు. ఎప్పుడు నిర్మించుకుంటాము? మన వ్యవసాయ పరిశ్రమలు సోవియట్‌లేక. అమెరికా మాదిరిగా ఎప్పుడు అభివృద్ధి చేసికుంటాము?" అని తహతహలాడుతున్నారు. ఏ ముసలయ్యను కదిలించినా. 'ఏమిరా! అబ్బాయ్; నాజీవితకాలంలో నాబోటి పేదవాడు విమానం ఎక్కుతాడా?' అని ప్రశ్నించుతాడు.

అంటే ప్రజలు తమ దేశాభ్యుదయానికి పరిశ్రమాభివృద్ధి అవసరమనిఎంచుతున్నారు. అందుకు ఆటంకాలు పెడుతున్న బ్రిటిష్ ప్రభుత్వం పోవాలంటున్నారు: జాతీయ ప్రభుత్వము కావాలంటున్నారు.

### ఆంధ్ర కాంగ్రెసు పెద్దల వింతధోరణి

ప్రజాభిప్రాయం యిలా వుంటే ఆంధ్ర కాంగ్రెసుపెద్దలు వింతధోరణి అవలంబిస్తున్నారు. యంత్రపరిశ్రమలు మనకు పనికిరావట. మే 3 వ తేదీన జరిగిన తెనాలి నేషనల్ క్లబ్బు వార్షికోత్సవంలో రంగనాయకులు యిలా సెలవిచ్చారు:

"కమ్యూనిస్టులు యంత్రాలు కావాలంటున్నారు. యంత్రాలువస్తే మనదేశంలో 1 కోటి మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. మిగతా 39 కోట్లు ఏమి చేయాలి? పిడకలు, పేడ చేయాలి. పిడకలు కూడా చేయ వీలుండదు. యంత్రాలే వాటిని చేస్తాయి." అన్నాడు.

అయ్యదేవరవారుగుడివాడసభలో,'గ్రామాలకు రోడ్లువుంటే విదేశ సరుకులు వస్తాయి గాన. అక్కరలేదు'ని. కూడ వాదించాడు. చంద్రమౌళి వగైరా యితర నాయకులుకూడ మనకు చేతిపరిశ్రమలే వుండాలిగాని, యంత్ర పరిశ్రమలువద్దని ఉపన్యాసాలుదంచుతున్నారు. పారిశ్రామికాభివృద్ధిని కోరడం బోల్షివిజాన్ని అనుసరించడమేనని వింతప్రచారం చేస్తున్నారు. యంత్ర పరిశ్రమలు వద్దనడం కాంగ్రెసు ఆశయమని ప్రచారం చేస్తున్నారు.

### దుర్భ్రమలు

ఈ పెద్దల వింతధోరణి ఖండించేముందు కాంగ్రెసు ఆశయమేమిటో తెలుపుతాను. హరిపురా కాంగ్రెసు జవ్హార్‌లాల్‌నెహ్రూ అధ్యక్షతక్రింద నేషనల్ ప్లానింగ్ కమిటీని నియమించింది. ఈకమిటీ సుప్రసిద్ధ సైంటిస్టులు. ఇంజనీర్లతో సంప్రదించి, భారత దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఒక రిపోర్టు తయారు చేసింది. ఇంతేగాక కాంగ్రెసుమహాసభ బాల్యావస్థలోవున్న భారతపరిశ్రమలకు రక్షణ యివ్వాలని అనేక సార్లు ప్రభుత్వంతో పోరాడింది. దీనినిబట్టి యంత్ర పరిశ్రమలకు కాంగ్రెసు వ్యతిరేకం కాదనుట స్పష్టం. బ్రహ్మాండమైన పరిశ్రమలనునిర్మించి భారతదేశాన్ని ఇతర దేశాలతో పాటు బలమైనరాజ్యంగా చేయడం కాంగ్రెసు ఆశయం. అందుకే కాంగ్రెసు నేషనల్ ప్లానింగ్ కమిటీని ఏర్పరచింది.

ఈ సందర్భంలో రంగాప్రభృతులు ఇంకో వాదన తేవచ్చు. గాంధీజీ 1919 సహాయ నిరాకరణోద్యమం నాటినుంచీ చేతిపరిశ్రమలే భారతదేశానికి కావాలంటున్నాడని వాదించవచ్చు. బ్రిటిష్ వస్తువులను, వస్త్రాలను బహిష్కరించే ఉద్యమానికి చిహ్నంగా రాట్నం వినియోగించినమాట నిజమే. కాని విదేశబట్టల బహిష్కరణ జయమొందడానికి కారణం రాట్నంకాదు. భారతదేశపు బట్టల మిల్లులు 1930-33 జాతీయోద్యమ ఫలితంగా విపరీతంగా లాభం పొందాయి. ఈ బట్టల పరిశ్రమ కారణంవల్లనే బహిష్కరణోద్యమం జయం పొందింది.

ఇంకోవిషయంకూడ మనం గమనించాలి. చేతి పరిశ్రమలపై ఆధారపడిన ఆర్థికవిధానం రోజులు గతించాయి. అంతకంటే ఉత్కృష్టమైన ఉత్పత్తివిధానం అమలులోకి వచ్చింది. అదే యంత్ర పరిశ్రమల విధానం. ప్రపంచమంతా ముందుకుపోతూంటే, "మేం భీష్మించి కూర్చుంటాం-ఉపనిషత్తుల యుగానికిపోతాం" అనడంలో అర్థంలేదు. సాధ్యమూకాదు. కీర్తిశేషులు గురజాడ అప్పారావుగారు అన్నట్లుగా

"వెనుకచూచిన కార్యమేమోయ్
మంచిగతమున కొంచమేనోయ్
మందగించక ముందు అడుగేయ్
వెనుకపడితే వెనకేనోయి!"

ఉదాహరణకు చూడండి! మన భారత దేశం విశాలమైనది. 39 కోట్ల ప్రజలమున్నాం. కాని చిన్నదేశం బ్రిటను మన నెత్తినెక్కి పరిపాలించుతోంది. అలాగే చిన్నదైన జపాను 40 కోట్ల ప్రజలు గల చైనాను పీడించుతూంది. ఇందుకు కారణం ఏమిటి? ఉన్నతమైన ఆర్థికవిధానం, యంత్ర పరిశ్రమలే బ్రిటనుకు, జపానుకు యీ శక్తిని సమకూర్చాయి. కాబట్టి వెనుకబడిన ఆర్థిక విధానంతో మనం భారత స్వాతంత్ర్యాన్ని కాపాడలేము అనుట స్పష్టం. మనం స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాము. మన ప్రజాభ్యుదయానికి అడ్డుగావున్న బ్రిటిష్ ప్రభుత్వాన్ని తొలగించుతాము. బ్రహ్మాండమైన పరిశ్రమలను నిర్మించి స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటాము. లేనిచో బానిసత్వమే మరల గతి అవుతుంది.

### ఆంధ్ర ప్రజా శ్రేయస్సు ఏమిటి?

మన ఆంధ్రదేశం పరిశ్రమలలో చాల వెనుకబడివుంది. మన రాయలసీమ రైతులు పండించిన ముడిదూదిని బొంబాయి వగైరా మిల్లులకు ఎగుమతి చేస్తున్నాము. బొంబాయి, అహమ్మదాబాద్ మిల్లులనుంచి బట్టలు దిగుమతి చేసికుంటున్నాము. ప్రత్తిపండించే మన రైతుస్థితి అధ్వాన్నంగా వుంది. బొంబాయి మిల్లు యజమానులు కోటికి పడగలెత్తుతున్నారు.

తెలుగు భూమిలో వేరుశనగ ఎక్కువగా పండుతోంది. ఇది ఎగుమతిఅయి, దుంప నెయ్యి దిగుమతి అవుతూంది. మధ్య లాభమంతా ఆ పరిశ్రమల యజమానులకు పోతూంది. నెల్లూరుజిల్లాలో అభ్రకం తవ్వుతున్నాం. ఎగుమతి చేస్తున్నామేగాని దానికి సంబంధించిన పరిశ్రమ మనకులేదు.

ఇంతేకాదు, కృష్ణా, గోదావరి ప్రవహించే ప్రాంతాలలో నేలబొగ్గు విశేషంగా దొరుకుతుంది, ముడియినుమువుంది. విశాఖజిల్లాలో 'మేంగనీస్'వుంది. భూగర్భంలోవున్న వీటిని తవ్వి బ్రహ్మాండమైన ఉక్కు, ఇనుము పరిశ్రమలు నిర్మించవచ్చు. మోటార్లు. విమానాలు, ఓడలు నిర్మించే యంత్రాలయాలు స్థాపించవచ్చు.

ఆంధ్రభూమిలో కృష్ణ, గోదావరి, పెన్న, తుంగభద్రలాంటి మహానదులు ప్రవహించుతున్నాయి. వీటి నీరు విశేషభాగం వృథాగా పోతూంది. ఆనకట్టలు నిర్మించి యీజలాన్ని చేలకుమలిపితే తెలుగునాడు సస్యశ్యామలమై వెలుగొందుతుంది.

ఈ నదీ ప్రవాహాల నుండి యంత్రాల సాయంతో విద్యుచ్ఛక్తిని తయారుచేయవచ్చు. ఇలా తయారైన ఎలెక్ట్రిసిటీతో రైల్వేలను, పరిశ్రమలను నడుపుకోవచ్చు. ఇండ్ల దీపాలు మొదలు వంట వరకు వినియోగించవచ్చు.

ఆంధ్రదేశంలో యిలాంటివే అనేక పరిశ్రమలు నిర్మించవచ్చు. అలాచేస్తేనే ఆంధ్ర జాతి సర్వతోముఖంగా అభివృద్ధిచెందుతుంది. ఇప్పటివలే నూటికి 80 మంది వ్యవసాయంపై ఆధారపడవలసిన అవసరంవుండదు. ప్రజల ఆర్థికస్థితి బాగుపడుతుంది. ధన, ధాన్య కనక వస్తువాహనాలతో తులతూగుతారు. ప్రజల విద్య విజ్ఞానం వృద్ధిచెందుతుంది. ఆంధ్రాభ్యుదయం ఉరకలు వేసికుంటూముందుకు సాగుతుంది.

### అడ్డు యెవరు?

ఈపని అంతాజరగడానికి ప్రజాప్రభుత్వం కావాలి. అందుకే మనం స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్నాం. కాని ఆంధ్రాభ్యుదయానికి, పరిశ్రమాభివృద్ధి, యంత్రాభివృద్ధి కావాలనే విషయం స్వాతంత్ర్య సైనికులమైన మనకు తెటతెల్లంగా వుండాలిగదా! స్వాతంత్ర్యం కోసం కృషిచేసే దేశభక్తులే మాకు పరిశ్రమలు వద్దనడం ఏమి సబబు? బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారతదేశం వ్యవసాయక దేశంగావుండాలంటున్నారు. తమఫ్యాక్టరీవస్తువులు అమ్ముకునేమార్కెటుగా మన దేశాన్ని వుంచటానికి వాళ్ళు ప్రయత్నించుతున్నారు.

ఆంధ్ర కాంగ్రెసు పెద్దలుకూడ మరో దృక్పథాన్నుంచి మనకు యంత్రపరిశ్రమలు వద్దంటున్నారు. చేతి పరిశ్రమలనే పట్టుకు వేలాడ దామంటున్నారు. వీరుగతించిపోయిన పరిస్థితులను, కాలాన్ని పట్టుకువ్రేలాడుతూ, ఆంధ్రాభ్యుదయానికే అడ్డుతగులుతున్నారు. ఉపనిషత్తులనాటి పౌరోహిత రాజ్యాన్ని స్థాపించుదామని కలలుగంటున్నారు. ఇదెన్నటికీ సాధ్యంకాదు.

### గుజరాతీ మార్వాడీ పోటీ

ఉదాహరణకు చూడండి. ఆంధ్ర కాంగ్రెసు పెద్దలలో చేతిపరిశ్రమల ఛాందసులు 1920 నుంచి యంత్రాలు మనకు వద్దంటున్నారు. ఐనప్పటికి యంత్రోత్పత్తివల్ల వచ్చే లాభాలు రాకపోయినా, మన ప్రజలు పెట్టుబడిదారీ విధానంవల్ల వచ్చేనష్టాలను అనుభవించుతున్నారు. గుజరాతీలు, మార్వాడీలు మనకంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందారు. వారు మిల్లుబట్టల వర్తకులుగాను, వడ్డీ వ్యాపారులుగాను ఆంధ్రదేశ మంతటా వ్యాపించారు. ప్రతిపట్టణంలోను హోల్‌సేల్ వ్యాపారం చేతిలోపెట్టుకుని వారు కోట్లు గడించారు. అధికవడ్డీలకిచ్చి ప్రజలను దోచుకుంటున్నారు. 1930 - 35 ఆర్థిక సంక్షోభం రోజుల్లో మనరైతులభూమిఎంతోవీరి చేతుల్లో పోయిందనే విషయం ఆంధ్రులందరికి తెలుసుగదా!

దీనినిబట్టి ఏమితేలుతుంది? మనకుయంత్ర పరిశ్రమలు లేకపోయినా పరిశ్రమల యజమానుల దోపిడిని మన ప్రజలు అనుభవించుతున్నారు. మనం చేతగాక కూర్చున్నాం. ఇతరులు కూర్చోరు. వచ్చి మనదేశంలో యంత్ర పరిశ్రమలు స్థాపించి లాభం పొందుతారు. ఉదాహరణకు మంగళగిరిలోని సిమెంటు ఫ్యాక్టరీ అంతేగదా! రాజమండ్రీ పేపరుమిల్లు యితరుల చేతుల్లోకి పోయింది. ఆంధ్రదేశంలోని జూట్‌మిల్లులు విజాతీయుల చేతుల్లోకి పోయాయి. చిట్టివలస. (మిగతా 11 వ పేజీ)

Editor: M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE